RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 151 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం,డిసెంబర్,5,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 151 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday,December,5,2025 | PAGES : 8 RS : 4 /- |



## చంపేస్తున్న చలి..

**అదిలాబాద్,తెలంగాణ దిశ :**చలి తీవ్రత అధికం కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఊహించిన దాని కంటే అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.తెలంగాణ, ఉత్తర కర్ణాటకతో పాటు మధ్య, వాయవ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయన్న వివరాలపై భారత వాతావరణ శాఖ ఐఎండీ ఓరిపోర్టు రిలీజ్ చేసింది. ఆయా ప్రాంతాల్లో పగలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా రికార్డు అవుతాయని చెప్పింది.ఆంధ్రప్రదేశ్‌లో పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే అధికంగా రికార్డు అవుతాయని పేర్కొంది. ఈ నెల దక్షిణాదిన సాధారణం లేదా అంతకంటే అధికంగా వర్షపాతం రికార్డు అవుతుందని చెప్పింది.ఉత్తర కోస్తాలో సాధారణం కంటే అధికంగా, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అవుతుందని తెలిపి ంది. ఈసంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటికే వాతావరణం చల్లబ డిందిదానితో పాటు లా నినా ప్రభావంతోచలి గాలులు పెరుగుతాయని ఐఎండీ చెప్పింది. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు గుడిసెల్లో నివసించే సంచార జాతుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

## ఆదిలాబాద్‌కు వరాల జల్లు




- ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం
- యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ
- సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు
- రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి

**ఆదిలాబాద్,తెలంగాణ దిశ:** ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనలదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్ పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పో ర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్ తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడి న ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారు లను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబా ద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. సీఎం రేవం త్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్య క్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగిం చారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటా నని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారం భిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవా ల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించా రు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది.



## చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- 500లకే గంటపాటు శిక్షణ

ఇస్లామాబాద్, డిసెంబర్4 : పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించుకుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్–మునినాత్'పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది.



## కోతుల సమస్యతో.. రైతుల పరేషన్

- జాతీయ సమస్యగా గుర్తించి చర్యలు తీసుకోవాలి
- లోక్‌సభలో ప్రస్తావించిన బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

న్యూఢిల్లీ,డిసెంబర్ 4: కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు.

## హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం



- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించన కెటిఆర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది.



## బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

- రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒకప్రాంతం వారు కాదు
- బిఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి
-రోశయ్య వర్ధంతి సభలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,తెలంగాణ దిశ :తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ది పొందేప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదనిమహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.



## వివాదంలో పొంగులేటి కుమారుడు హర్షారెడ్డి..?

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు హర్షా రెడ్డి మీద వట్టినగులపల్లిలో భూమి ఆక్రమణ దౌర్జన్యంలో హత్యాయత్న కేసు నమోదు అయి నా ఎఫ్ఐఆర్ మార్చేశారని భారత రాష్ట్ర సమితి నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మంత్రి కుమారుడు 70 మంది బౌన్సర్లు బృందంతో మూడు ఎకరాల భూమిని ఆక్ర మించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న వారిపై దాడి చేసి, హద్దుల గోడలు కూల్చి వేశారు. పశువుల షెడ్‌ను ధ్వంసం చేశా రు. పొంగులేటి కుటుంబానికి చెందిన కంపెనీ వట్టి నాగుల పల్లిలో ఓ ప్రాజెక్ట్ చేపట్టింది. ఆ ప్రాజెక్టు పక్కనే ఈ భూమి ఉన్న ట్లుగా తెలుస్తోంది. దాడి చేసిన వారు మాఫియా గ్యాంగ్‌లా ప్రవ ర్తించి, భూమి హద్దుల గోడలు కూల్చి, ఆవుల షెడ్‌ను ధ్వంసం చేశారని ప్రత్యక్ష సాక్షులు పోలీసు లుకు చెప్పినట్లుగా తెలుస్తోంది.

# అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ

## - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్








**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 04, (తెలంగాణ దిశ) :** హైదరాబాద్ నగరంలోని పారిశ్రామికవాడల్లో ఉన్న ఐదు లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను దోచుకునే హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ పేరుతో జరుగుతున్న కుట్ర మీద పోరుబాట చేసారు. బిఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. బిఆర్ఎస్ ఎల్ పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్లమెంటరీ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ముఖంగా సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మీడియా ముఖంగా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ పేరుతో ఐదు లక్షల కోట్ల రూపాయల భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోందన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. పరిశ్రమలు వద్దంటూ... అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేట్ వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగిందన్నారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకు తుంటే, ప్రభుత్వం కేవలం రూ. 4 వేలకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పుతుందని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇండ్లకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు, చివరికి స్మశానాలకు కూడా స్థలం లేదన్నారు. కానీ, ప్రైవేట్ వ్యక్తులకు 9,300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటోందన్నారు. ఈ 9,300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అక్కడ కాంగ్రెస్ చెబుతున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు నిర్మించాలని కోరారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలివెళ్తే, హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే ఈరోజు పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిగ్గుతేల్చాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితో మా పార్టీ వదిలిపెట్టదన్నారు. హిల్ట్ పాలసీ కుంభకోణంపైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. ఈ పాలసీని వెనక్కి తీసుకొని, లక్షల కోట్ల విలువైన ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుందన్నారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు రద్దు చేస్తామన్నారు. అవసరమైతే ఇందు కోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే, అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక... తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ఓ తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయ్యిందంటూ ప్రభుత్వం బాధపడుతుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జీడిమెట్ల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి కనీసం లక్ష రూపాయలు ఉందని, కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ నాలుగు వేలకు గజం చొప్పున పూర్తిగా భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతుందన్నారు. ఒకవైపు రూ. 170 కోట్లకు ఎకరం చొప్పున భూములు అమ్మిన ప్రభుత్వం అంటూ రోజు వార్తలు రాయించుకుంటున్న సర్కార్, మరోవైపు కేవలం కోటి రూపాయలకు ఎకరం చొప్పున జీడిమెట్లలో భూమిని ఎలా అమ్ముతుందని ఆయన ప్రశ్నించారు.? ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి క్షేత్రస్థాయిలో ఉన్న నిదర్శనమన్నారు. గతంలో తెచ్చిన గ్రిడ్ పాలసీ ద్వారా కేవలం ఐటీ కార్యాలయాలు మాత్రమే నిర్మాణం చేసేందుకు అవకాశం ఉండేదన్నారు. ఐటీ కార్యాలయాల ఏర్పాటు వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయన్నారు. పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, మా పాలసీ ఆదర్శం అయితే... ఈ పారిశ్రామిక భూములలో ఎలాంటి కాలుష్యం లేని పరిశ్రమలకు మాత్రమే తిరిగి భూములు కేటాయించాలన్నారు. ఐటీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మాత్రమే అనుమతించాలి. అం తేకానీ అప్పనంగా అపార్ట్‌మెంట్లకు, విల్లాలకు ఇస్తామంటే కుదరదన్నారు. హైదరాబాద్ నగరం నుంచి కాలుష్య కారక పరిశ్రమలను బయటకి బయటకు పంపించాలన్నది అందరి ఉద్దేశం అన్నారు. అందుకే ఎలాంటి పొల్యూషన్ లేని అంతర్జాతీయ స్థాయి ఫార్మాసిటీని ఏర్పాటు చేశామన్నారు. దాన్ని కూడా రేవంత్ రెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకుంటున్నాడన్నారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడన్నారు. రేవంత్ రెడ్డికి తెలిసింది కేవలం రియల్ ఎస్టేట్ దందా మాత్రమేనని, అందుకే అక్కడ ఫార్మాసిటీలోనూ, ఇక్కడ పారిశ్రామిక భూముల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడన్నారు. అనంతరం జీడిమెట్ల పారిశ్రామిక లోని పలు పరిశ్రమలను సందర్శించి కార్మిక సమస్యలపై కార్మికులతో, పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చదువు నేర్పే ముందు ఉపాధ్యాయులు విద్యార్థుల మనసులు గెలవాలి

## - రంగారెడ్డి డీఈవో సుశీందర్ రావు సూచన






**శేరిలింగంపల్లి, డిసెంబర్ 04, (తెలంగాణ దిశ) :** గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం సేవలను ప్రభుత్వ పాఠశాలల్లో విరివిగా ఉపయోగించుకోనున్నట్లు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి పి. సుశీందర్ రావు హామీ ఇచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం (గచ్చిబౌలి) ఆధ్వర్యంలో కార్యదర్శి పి. ప్రభాకర్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్ లో నిర్వహించిన బాలోత్సవ్ సభ మొదటి రోజు ముగింపు సభకు డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను అభినందించారు. కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని పేద విద్యార్థుల కోసం పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని మండలాల విద్యాధికారులను ఆదేశించారు. వినడం కన్నా చదవడం ద్వారా నేర్చుకున్న విషయాలు ఎక్కువగా గుర్తుంటాయని, అదే పనిగా తరగతి గదిలో చదువుకోమంటే పిల్లలు ఇష్టపడరనీ, బాలోత్సవ్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఎస్వీకే లాంటి ప్రదేశాలకు వచ్చి బయటి ప్రపంచం చూస్తుంటే వారిలో ఆసక్తి పెరుగుతుందన్నారు. చదువు నేర్పించే ముందు ఉపాధ్యాయులు పిల్లల మనసులను గెలవాలన్నారు. సమాజం మంచి కోరేవారు, సమాజం చెడు కోరేవారు ఇద్దరూ తరగతి గది నుంచే తయారవుతారన్నారు. ఏ టీచర్ అయితే విద్యార్థిని సరిగ్గా తీర్చిదిద్దరో ఆ గది నుంచి వచ్చే వారు చెడు కోరేవారుగా తయారవుతున్నారని చెప్పారు. తమ పరిధిలో 1,500 స్కూళ్లు ఉన్నాయని, అవసరం మేరకు ఎస్వీకే సేవలను ఉపయోగించుకుంటామన్నారు. సభకు అతిథిగా హాజరైన ఎ.రాంచంద్రయ్య మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దే దర్శకత్వ బాధ్యతను టీచర్లు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మనిషి అని గుర్తించడానికి కళా దృక్పథం ఉండాలని సూచించారు. కళాత్మక దృష్టి ఉంటేనే మనిషి ఉత్తేజంగా ఉంటారనీ, ప్రముఖ శాస్త్రవేత్త వయోలిన్ వాయించే వాడని ఉదహరించారు. తాను నాలుగో తరగతి నుంచి పరిశోధన చేసేంత వరకు ప్రతి ఏడాది నాలుగైదు కళాత్మాక కార్యక్రమాల్లో పాల్గొనే వారమని గుర్తుచేసుకున్నారు. ఏ విషయాన్ని గుడ్డి నమ్మొద్దనీ, సంశయాత్మకంగా ఉన్న విషయాలపై ప్రశ్నించి తెలుసుకోవాలని సూచించారు. పి. ప్రభాకర్ మాట్లాడుతూ 26 స్కూళ్లలో బాలోత్సవ్ లో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. ఆయా స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో తుది పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన సిబ్బంది, ఉపాధ్యాయులు, డ్యాన్సర్స్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం రెండవ రోజు బాలోత్సవ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎస్వీకే సమీపంలోని 10 చోట్ల పేద విద్యార్థులకు ట్యూషన్స్ చెబుతున్నట్టు చెప్పారు. పేద విద్యార్థులతో పాటు బడ్జెట్ స్కూళ్ల విద్యార్థులు విద్యావసరాల కోసం ఎస్వీకేను సంప్రదిస్తే అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఎస్వీకే గ్రంథాలయంలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో మూడు లక్షల పుస్తకాలున్నాయనీ, వాటిలో 15 వేల పుస్తకాలు డిజిటల్ లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఎస్వీకే ఆధ్వర్యంలో 10 మంది స్పెషలిస్టు డాక్టర్ల తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులందిస్తున్నట్టు వెల్లడించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కూడా కొనసాగుతుందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధానంగా నిలిచి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన అగ్రగణ్యుల్లో ఒకరు, మొదటి పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ సైకిల్ పై ప్రయాణించిన పుచ్చలపల్లి సుందరయ్య సమాజానికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. సుందరయ్య ఆశయాల సాధనకు తమ కృషి కొనసాగుతుందనీ పిలుపునిచ్చారు. అంతకు ముందు చంద్రయ్య మ్యాజిక్ షో ద్వారా పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచే ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆహుతులతో కలిసి సుశీందర్ రావు విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని శ్రద్ధగా ఆలకించి నేర్చుకుంటున్న ఐదో తరగతి విద్యార్థినీ ప్రత్యేకంగా అభినందించిన డీఈవో వ్యక్తిగతంగా రూ. వెయ్యి నగదు పారితోషికాన్ని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల విద్యాధికారి కె.వెంకటయ్య, గండిపేట మండల విద్యాధికారి సునీల్ కుమార్, ఎస్వీకే ట్రస్ట్ సభ్యులు ఆర్. సాంబశివరావు, బలోత్స వం కన్వీనర్ సి. విజయ్ కుమార్, కల్చరల్ బాధ్యులు శ్రీనివాసరావు, ఎస్వీకే బాధ్యులు అనిల్, రవి, మహిళా బాధ్యురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యా పాలసీలో టి -సాట్ ను భాగస్వామిని చేయాలి

## కేశవరావు ను కోరిన టి -సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 04 (తెలంగాణ దిశ) :** తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు నూతనంగా ఏర్పాటు చేయబోయే తెలంగాణ నూతన విద్యా పాలసీలో టి-సాట్ ను భాగస్వామిని చేయాలని విద్యాపాలసీ కమిటీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావును టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లోని కేశవరావు నివాసంలో గురువారం కలిసిన సీఈవో వేణుగోపాల్ రెడ్డి టి-సాట్ రూపొందించిన పాలసీ డాక్యుమెంట్ అందచేశారు. ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ స్థాయితో పాటు పోటీ పరీక్షల కంటెంట్ అందించి దేశంలోనే డిజిటల్ విద్యా ఛానళ్లలో మొదటి స్థానంలో టి-సాట్ ఉందని సీఈవో గుర్తు చేశారు. ఐదు సంవత్సరాల విద్యార్థి నుండి 60 సంవత్సరాల వ్యక్తులకు అవసరమయ్యే విద్యకు సంబంధించిన కంటెంట్ వివిధ డిజిటల్ ప్రసార మాద్యమాల్లో టి-సాట్ శాటి లైట్, యాప్, ఓటిటి, సోషల్ మీడియా ఫ్లాట్ ఫాంలో అందుబాటులో ఉందని వివరించారు. 4.8 మిలియన్ల పైగా యూజర్లతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటూ దేశంలోనే మొదటి స్థానాన్ని రెండు సంవత్సరాల్లో టి-సాట్ అధిరోహించిందని, తెలంగాణ ప్రభుత్వం రూపొందించబోయే నూతన ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా సైతం తెలంగాణ సమాజానికి డిజిటల్ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఈవో వివరించారు. సీఈవో అందచేసిన డాక్యుమెంట్ ను పరిశీలించిన కేశవ రావు సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ స్థాయిల్లోని విద్యార్థులు, యువత, వయోజనులు, మహిళలతో పాటు ఇతర రంగాలకు అందిస్తున్న డిజిటల్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. తెలంగాణ నూతన విద్యావిధానంలో టి-సాట్ సేవలు తప్పనిసరిగా వినియోగించుకునే విధంగా పాలసీని రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా చింతల మాణిక్యరెడ్డి జన్మదిన వేడుకలు



**అల్వాల్, డిసెంబర్ 05, (తెలంగాణ దిశ) :** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చింతల మాణిక్యరెడ్డి జన్మదిన వేడుకలు అల్వాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఆయనతో పాటు కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి, నామినేటెడ్ సభ్యుడు భానుక మల్లికార్జున్, గిరివర్ధన్ రెడ్డి, ప్రసన్న, మల్లికారావు, తుర్క నరసింహ, రాజిరెడ్డి, శేఖర్ యాదవ్, శ్రీనివాస్ వర్మ, కార్తీక్ గౌడ్, శ్రీధర్ గౌడ్, మల్కాజ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, మల్కాజ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, అనిల్ కుమార్, ఉదయ్ ప్రకాష్, వినయ్ శంకర్, సుజాత, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, వంశీ, శ్రీధర్ రెడ్డి, సూర్య దండి, హనుమంత్ రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, భూపాల్ రెడ్డి, అనిల్, తదితరులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# సంపాదకీయం

## కమలం 1800 పై గురి...!

భారతదేశ రాజకీయ సమీకరణంలో ఎగువ సభ పాత్ర ఎప్పుడూ నిర్ణాయకమైంది. లోకసభలో స్పష్టమైన ఆధిక్యంతో వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీకి రాజ్యసభలో మాత్రం ఇంకా సౌకర్యవంతమైన మెజారిటీ లేదు. కారణం, ఎక్కువ మంది సభ్యులు ఉన్న రాష్ట్రాలు ప్రత్యర్థి పార్టీల ఆధీనంలో ఉండటమే. బీజేపీ.. ఇటీవల బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు 202 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధం కాగా, అందులో బీజేపీ 89 సీట్లతో దుమ్ములేపింది. ఇక మరో ఎన్డీఏ పక్షం జేడీయూ 85 సీట్లను సాధించి.. బీజేపీ కంటే వెనుకబడింది. దాంతో బిహార్‌లో బీజేపీ ప్రతిష్ట మరింత పెరిగింది. ఇదిలా ఉంచితే, 2004 నాటికి బీజేపీ ఓవరాల్ ఎమ్మెల్యేల సంఖ్య 1035 ఉండగా, నేటికి ఆ సంఖ్య మరింత ముందుకెళ్లింది. 2025 నాటికి బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య 1654గా ఉంది. దేశవ్యాప్త అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ఎలా తన ఉనికిని కాపాడుకుంటూ ముందుకెళుతుందనే విషయాన్ని ఆయన వెల్లడించారు. తాము ప్రస్తుతానికి సాధించిన సంఖ్య ఏదైతే ఉందో అది బీజేపీ రాజకీయ చరిత్రలో అత్యధికమన్నారు. ముమ్మందు కూడా తమ పార్టీ వికాసం ఇలానే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారాయన. రాబోయే రెండేళ్లలో తమ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 1800కు చేరుతుందనే ధీమా వ్యక్తం చేశారు మాలవీయ. ప్రతిపక్ష ఇండియా కూటమికి వరుస ఎన్నికల్లో ఓటములతో ఎదురు దెబ్బలు తప్పడం లేదు. ఈ తరుణంలో నాయకత్వ మార్పు అంశం మరోసారి చర్చనీయాంశమైంది.రాజ్యసభ మొత్తం సీట్ల పంపిణీ రాష్ట్రాల జనాభా ప్రకారం ఉంటుంది. ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల వంటి రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించబడ్డాయి. వీటిలో ఎక్కువ రాష్ట్రాల్లో బీజేపీ ప్రత్యక్షంగా లేదా కూటమిగా పరిమిత బలం కలిగి ఉండటం వల్ల పార్లమెంటు పై సభలో ప్రత్యక్ష ప్రభావం తగ్గింది.గత ఏడాది మహారాష్ట్రలో, తాజాగా బిహార్‌లో జాతీయ జనతా దళం (జేడీయూ)తో సఖ్యత ద్వారా బీజేపీ తిరిగి అధికార భాజనమైందే కాక, ఎన్డీఏ కూటమి పాలన కొనసాగుతోంది. బిహార్‌లో 16 రాజ్యసభ స్థానాలు ఉండగా, ఈసారి కూటమి కలసి పోటీ చేస్తే అన్ని సీట్లు ఎన్డీఏ ఖాతాలో వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది బీజేపీకి ఎగువ సభలో బలం పెంచే కీలక అవకాశంగా నిలుస్తుంది. కూటమి రాష్ట్రాల్లో బీజేపీకి లభించే స్థానాలు మిత్ర పక్షాలతో పంచుకోవాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనలతో కూటమిగా ఉండటంతో అక్కడి సీట్లలో భాగస్వామ్యం తప్పదు. ఇదే పరిస్థితి బిహార్‌లోనూ ఉంది. ఈక్రమంలో సీట్ల సంఖ్య పెరిగినా, పార్టీకి నేరుగా లభించే వాటా పరిమితంగానే ఉంటుంది.రానున్న నెలల్లో హరియాణా, ఒడిశా రాష్ట్రాల్లో బీజేపీ స్వతంత్ర అధికారాన్ని బలోపేతం చేసింది. ఈ రాష్ట్రాల నుంచి వచ్చే సీట్లు బీజేపీ బలాన్ని రాజ్యసభలో మరింత పెంచబోతున్నాయి. రాజ్యసభలో సంఖ్యాబలం తక్కువగా ఉన్నా రాజకీయ చాతుర్యంతో బీజేపీ కీలక బిల్లులను ముందుకు తీసుకెళ్లగలిగింది. బిహార్ మార్పు, కొత్త రాష్ట్రాల్లో విస్తరణతో ఎగువ సభలో స్థిరబలం సాధించే వ్యూహం స్పష్టమవుతోంది. కానీ దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడడం లేదు. మిత్రుల సాయంతో పర్వాలేదనిపిస్తోంది. కానీ సొంతంగా ఎదగాలన్న క్రమంలో చతికల పడుతోంది. బిజెపికి మాత్రమే ఎందుకు ఈ పరిస్థితి అనేది ఒక వాదన. నాయకుల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమన్నట్టు విశ్లేషణలు ఉన్నాయి. బీహార్లో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించడంతోపాటు ఎన్డీఏ తిరుగులేని విజయం సాధించడంతో.. తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త చర్చ ప్రారంభం అయింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంకెప్పుడూ సంబరాలు అని ఎక్కువమంది పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. బిజెపి అభివృద్ధి అనేది ఇప్పట్లో జరిగే పనిలా కనిపించడం లేదు. ఎందుకంటే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ బలం పెరగడం లేదు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. ఇక్కడ బలమైన రెండు ప్రాంతీయ పార్టీలు హవా చూపిస్తున్నాయి. వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయానికి ఏపీలో బిజెపి ఎంట్రీ ఇచ్చింది. విశాఖలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 1982లోనే బిజెపి విజయం సాధించింది. కానీ తరువాత సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయలేదు. బిజెపి విధానాలు ఏపీ ప్రజల్లోకి బలంగా వెళ్లలేదు. జాతీయస్థాయిలో బిజెపి అవసరార్థం ఏపీలో ఉన్న రాజకీయ పొత్తులతో బిజెపిని గెలిపించాయే తప్పించి.. బిజెపి సొంతంగా ఎదిగిన దాఖలాలు మాత్రం ఏపీలో లేవు. 2019 ఎన్నికల్లో కనీసం ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. 2024లో తెలుగుదేశం, జనసేనతో జతకట్టడంతో 8 ఎమ్మెల్యే సీట్లు, మూడు ఎంపీ సీట్లను గెలుచుకున్న బీజేపీ ప్రాతినిధ్యం పెంచుకుంది. 2029 ఎన్నికల్లో ఇదే పొత్తు కొనసాగితే పరవాలేదు కానీ.. పొత్తు లేకుంటే మాత్రం ఒక్క సీటు కూడా బిజెపి గెలిచే అవకాశం లేదు.ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో బిజెపి అభివృద్ధికి చాలా రకాల అవకాశాలు వచ్చాయి. అక్కడి ప్రజలు బిజెపిని ఆదరించారు కూడా. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. అప్పటినుంచి తెలంగాణలో బిజెపి అభివృద్ధి కావడం ప్రారంభం అయింది. క్రమేపీ తన ప్రాతినిధ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. అయితే 2023లో కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ ఓడిపోయిన నాటి నుంచి బిజెపి ఎదగడం ప్రారంభించింది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను బిజెపి పోషించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ సీట్లను కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. చాలా చోట్ల డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇటువంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ స్థానంలో బిజెపి వచ్చి చేరిందని విశ్లేషణలు మొదలయ్యాయి. కానీ తెలంగాణ బిజెపిలో నేతల మధ్య సమన్వయ లోపంతో పార్టీ బలహీన పడింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా బిజెపికి రాలేదు. అదే సమయంలో కెసిఆర్ పార్టీ తన బలాన్ని పెంచుకుంది. రెండో స్థానంలో నిలిచింది. అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ బిజెపి విఫలం అయింది.ఏపీలో ఎదిగే ప్రయత్నం జరగడం లేదు. తెలంగాణలో ఎదిగిన తరువాత పార్టీ బలహీనం అవుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో పార్టీ అభివృద్ధి అనేది కూడా జరగదు. ఎందుకంటే కేంద్రంలో ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఆ కారణం చేత ఏపీలో టిడిపిని కాదని బిజెపిని మరింత బలపరిచే పరిస్థితి కనిపించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పార్టీని కాపాడేందుకు బిజెపి తనను తాను తగ్గించుకుంది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు బిఆర్ఎస్ తో బిజెపి చేతులు కలిపిందన్న మాటలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. బిజెపికి ఓటు వేస్తే బీఆర్ఎస్ కు వేసినట్టేనని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. మొత్తానికి అయితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఎదగడం అన్నది ఇప్పట్లో జరిగే పని మాత్రం కాదు.



## భూ సమస్యలు తీరేదెన్నడు ?

**వరంగల్,తెలంగాణ దిశ :** భూములను ఏళ్ల తరబడి సాగుచేస్తున్నా పట్టాలు లేవు. కొనుగోలు చేసిన భూములకు హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని కోరినా ఫలితం లేదు. ధరణి నుంచి భూభారతి వరకు ఎన్ని చట్టాలు తెచ్చినా పరిస్థితి మారడం లేదు. ఏళ్ల తరబడి కార్యాలయలు, అధికారుల చుట్టూ రైతులు తిరిగినా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. సాదాబైనామాల నుంచి అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దరఖాస్తులు చేస్తున్నా పరిష్కారం కావడం లేదు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు భూ సమస్యలు కొలిక్కి రాలేదు. తాతల కాలం నాటి నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు రావడం లేదు. సాదాబైనామాల కింద కొనుగోలు చేసిన భూములకు పట్టాలు కావడం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూ సమస్యల పరిష్కారం కోసం ధరణిని తీసుకువచ్చినా సమస్యలు కొలిక్కి రాలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు ధరణి స్థానంలో భూ భారతిని తీసుకువచ్చిన ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు.

**ఉమ్మడి జిల్లాలో లక్షల్లో దరఖాస్తులు..:** ఉమ్మడి జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. రైతులు వారసత్వంగా వచ్చిన భూముల సమస్యలతో పాటు ఏళ్ల కింద కొనుగోలు చేసిన సమస్యలు కూడా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో పేదల కోసం ఇచ్చిన అసైన్డ్ భూముల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. పోడు భూముల సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. మూడు నాలుగు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ పంటలు పండిస్తున్నా పట్టాలు రావడం లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూ సమస్యల పరిష్కారం కోసం ధరణిని అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చింది. ధరణిలో భూముల వివరాలు ఎంట్రీ చేసే సమయంలో భారీగా తప్పులు దొర్లాయి. సర్వే నెంబర్లు, భూమి హక్కుదారుడి పేరు, విస్తీర్ణం వంటి వివరాలను ఎంట్రీ చేసే సమయంలో తప్పులు జరిగాయి. ఇవే కాకుండా వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. కొన్ని అసైన్డ్ భూముల వివరాలు కూడా తప్పుగా నమోదు చేశారు. సాదాబైనామాలకు సంబంధించి భూముల వివరాలు కూడా సవరించలేదు. వారి వివరాల ఆధారంగా పట్టాలను జారీ చేయలేదు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వలేదు. దీంతో భూ భారతి చట్టం వచ్చిన తర్వాత గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తులు చేశారు. ఉమ్మడి జిల్లాలో సాదాబైనామాలకు సంబంధించి లక్షా 79వేల 697 దరఖాస్తులు చేశారు. వరంగల్ జిల్లా పరిధిలో 53,996, హన్మకొండ పరిధిలో 18,507, జనగామలో 30వేలు, మహబూబాబాద్ లో 24,014, భూపాలపల్లిలో 18,739, ములుగులో 34,441 దరఖాస్తులు వచ్చాయి. ఇవే కాకుండా నిషేధిత భూములు, సర్వే నంబర్ తప్పులు, పేర్ల నమోదు తప్పులు, విస్తీర్ణంకు సంబంధించిన వివరాల ఎంట్రీలో తప్పులకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలో మరో లక్షా 20వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సులు ముగిసి నెలలు గడుస్తున్నా వాటిపైన దృష్టి పెట్టడం లేదు. నామమాత్రంగా కొన్ని సమస్యలను పరిష్కరిస్తున్నారు. సాదాబైనామాల పేరు మీద కొనుగోలు చేసిన రైతులు ఏళ్ల తరబడి పట్టాలు రాక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పంట రుణాలు, రైతుబంధు రాకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎవరైనా అవసరాల కోసం భూములను అమ్ముకోవాలన్నా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎంట్రీలో పొరపాటున నిషేధిత జాబితాలో చేరిన భూముల సమస్యలు పరిష్కారం కావడం లేదు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చినా సమస్యలు పరిష్కరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణిలో ఈ ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి.

**70 శాతం తహసీల్దార్, ఆర్డీఓ పరిధిలోనే..:** ఉమ్మడి జిల్లా పరిధిలో భూభారతి చట్టం ద్వారా భూముల సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా కొంత మంది అధికారులు మాత్రం వివాదాస్పద భూముల పై దృష్టి పెడుతున్నారు. తమకు ఆదాయం వచ్చే వాటినే ఎక్కువగా పరిష్కరిస్తున్నారు. రైతుల భూసమస్యలను మాత్రం ముట్టుకోవడం లేదు. సాదాబైనామాలు, ఇతర భూ సంబంధిత విషయాల్లో వచ్చిన దరఖాస్తుల్లో 70 శాతంకు పైగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల పరిధిలోనే పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో కొన్ని మండలాల పరిధిలో మాత్రం వివాదాస్పద భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనా పట్టించుకోవడం లేదు. కబ్జాదారులకే కొంత మంది అధికారులు వంత పాడుతున్నారు. ఆ భూముల సమస్యలను పరిష్కరిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. కాజీపేట, ధర్మసాగర్, హసన్?పర్తి, ఖిల్లా వరంగల్, ఐనవోలు మండలాలతో పాటు పలు మండలాల పరిధిలో ఇదే విధమైన చర్యలను కొంత మంది అధికారులు చేపడుతున్నారు. మంత్రులు చెబుతున్నా మండలాల స్థాయిలో మాత్రం అధికారులు చొరవ చూపడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ల వరకు భూసమస్యలపైన నజర్ పెట్టి భూభారతి ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరిస్తే సన్న, చిన్నకారు రైతుల సమస్యలు పరిష్కారం కానున్నాయి.

## ఆదాయం ఉన్నా... అన్నీ సున్నానే

### అబ్కారీ శాఖ పనితీరు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** వాణిజ్య పన్నుల శాఖ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టేశాఖ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ. 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందంగా శాఖను రకరకాల సమస్యలు వెంటాడుతున్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారుల అలసత్వం, నిర్లక్ష్యం ఉద్యోగులు, సిబ్బందికి శాపంగా మారింది. శాఖ నుంచి లెక్కలేనంత ఆదాయం వస్తున్నప్పటికీ శాఖ పనితీరు, నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రగ్స్, నార్కోటిక్స్ నిర్మూలన వంటి కీలక విధులుండేశాఖను సిబ్బంది కొరత వేధిస్తున్నది. ల్యాబ్‌ల్లో సుశిక్షితులైన టెక్నీషియన్లు లేక కేసుల పరిష్కారం ఆలస్య మవుతున్నది. 2017 నుంచి ఇప్పటివరకు సాధారణ బదిలీలు లేకపోవడం, 70 శాతం స్టేషన్లు అద్దె భవనాల్లో కొనసాగుతుండటం విమర్శలు వెల్లువె త్తుతు న్నాయి. సాధారణంగా ఏ ప్రభుత్వశాఖలోనైనా రెండేళ్లకోసారి బదిలీల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, ఎక్సైజ్‌శాఖ మాత్రం ఎనిమిదేళ్ల నుంచి బదిలీల గురించి పట్టించుకోకపోవడం గమనార్హం.ప్రభుత్వశా ఖల్లో ఎంత చిన్నశాఖలోనైనా బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరుగుతుంది. కానీ, ఎక్సైజ్ శాఖలో 2017 నుంచి ఎస్సై నుంచి ఆపై క్యాడర్లకు ఇప్పటివరకు సాధారణ బదిలీలు జరగలేదు. ఎనిమిది సంవత్సరాలుగా బదిలీలప్రక్రియ పెండింగ్‌లోనే ఉంది.దీంతో ఎంతో మంది ఉద్యోగులు, అధికారులు ఒకేచోట తిష్ఠ వేసుకుని కూర్చున్నారు. ఈ పరిస్థితి అధికార వికేంద్రీకరణ, పాలనా పారదర్శకతకు ఆటంకం కలిగిస్తోంది.పార్లమెంట్ ఎన్నికల ముందు తూతూ మంత్రం గా కొన్ని బదిలీలు చేసినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో జరగకపోవడం గమనార్హం. ఇప్పటికీ సిబ్బంది బదిలీలు, ఉద్యోగోన్నతులు విషయం ప్రశ్నార్థకంగానే ఉంది. ఎక్సైజ్‌శాఖ 2014 నుంచి ప్యానల్ ఇయర్‌ను రూపొందించకపోవ డం, సీనియారిటీ జాబితాను సిద్ధం చేయకపోవ డం వల్ల ఉద్యోగులు సుదీర్ఘకాలం నుంచి ఒకే పోస్టింగ్‌లో ఎదుగూబొ దుగూ లేకుండా ఉంటున్నారు.పదోన్నతుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైల్‌పై సంతకం సైతం చేశారు. అయినప్పటికీ, ఇప్పటివరకు ఆ దస్త్రం వెలుగు చూడలేదు. దానిపై ఎలాం టి కసరత్తు లేకపోవడంపై ఉద్యోగులు విస్మయం వక్త్యం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు ఒనగూరలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖకు 139 స్టేషన్లు ఉండగా వీటిలో 70శాతం వరకు స్టేషష్లు అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే కొత్తగా నిర్మించాల్సిన 14 స్టేషన్ల సంగతి కూడా ఎటూ తేలడం లేదు. సొంత భవనాల గురించి ఉన్నతాధికారుల ప్రశ్నిస్తే దశాబ్దాల నుంచీ'ప్రభుత్వం సొంత భవనాలకు నిధులివ్వడం లేదు' అని చెప్తుండటం గమనార్హం.అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య సిబ్బంది పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 22 ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టుల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. చెక్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వలేదు. ఆ చెక్‌పోస్టుల్లో వారికి మౌలిక సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల గుడారాలు వేసుకు ని, మరికొన్ని చోట్ల కంటెయినర్లను కార్యాలయాలుగా మార్చుకుని విధులు నిర్వహిం చాల్సిన దుస్థితి నెలకొంది.డగ్స్, నార్కోటిక్స్, నకిలీ మద్యానికి సంబంధించి కేసులను ఎక్సైజ్‌శాఖ సత్వరం పరిష్కరించాలంటే రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో ల్యాబ్‌లు ఉండాలి. కానీ, ఆ శాఖకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం మూడంటే మూడే ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా అప్‌డేట్ అయినవి, అత్యాధునిక యంత్రపరికరాలతో ఉన్నవి కాకపోవడంతో కేసుల పరిష్కారం మరింత ఆలస్యమవుతున్నది.ప్రస్తుతం అందుబాటులో ఉన్న ల్యాబ్‌లు ద్వారా కేవలం గుడుంబా కేసులకు సరిపోతాయని, గంజాయి, మెఫెడ్రోన్, హాషిష్ ఆయిల్, ఎండీఎంఏ, కొకైన్, ఎల్‌ఎస్‌డీ, హెరాయిన్ వంటి పరీక్షలకు పెద్దగా ఉపయోగపడవని సొంతశాఖ సిబ్బందే వాపోతుండటం గమనార్హం. అలాగే ఆయా ల్యాబ్‌ల్లో సుశిక్షితులైన సిబ్బంది లేరనేది వాస్తవం. ఎక్సైజ్‌శాఖ ముఖ్యమైన కేసులు ఉన్నప్పుడు పోలీస్ శాఖకు చెందిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)పైనా ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తక్షణం స్పందించి ఎక్సైజ్ శాఖపై దృష్టి సారించాలని ఆశాఖ సిబ్బంది కోరుతున్నారు.

## వంగవీటి ఫ్యామిలీకి కాపు కాస్తారా..?

**కాకినాడ,తెలంగాణ దిశ :**ఏపీ రాజకీయాల్లో కాపులు ఎప్పుడు ప్రత్యేక స్థానమే. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి వారి ప్రస్తావన ప్రత్యేకంగా ఉంటుంది. వారి ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రకటనలు కూడా వస్తాయి. ఎందుకంటే ఏపీలో సంఖ్యా బలంగా కాపులు అధికం కాబట్టి. అందుకే వారిపై ప్రభావం చూపే ఏ అవకాశాన్ని రాజకీయ పార్టీలు విడుచు కోవు. కాపులు ఏ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటే ఆ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. చాలా సందర్భాల్లో కూడా ఇది చూసాం. మిగతా సామాజిక వర్గాలకు భిన్నంగా ఉంటుంది కాపుల వైఖరి. సీఎం వంటి పోస్టులు దక్కలేదన్న ఆందోళన, ఆవేదన ఆ సామాజిక వర్గంలో ఉంది. అయితే దానిని కొంతవరకు నెరవేర్చారు పవన్ కళ్యాణ్. ఏపీ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర చాటుకొని డిప్యూటీ సీఎం హోదా వరకు వెళ్లారు. ఈ రాష్ట్రానికి ఏకైక డిప్యూటీ సీఎం గా ఉంటూ చంద్రబాబుతో సమానంగా తన పవర్ను వాడుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ టిడిపి తో కలిసి వెళ్తారు. బిజెపిని కలుపుకొని పోటీ చేస్తారు. దీంతో కాపు సామాజిక వర్గం కూటమి వైపు తప్పకుండా ఉంటుంది. అయితే దానికి విరుగుడు చర్యలుగా జగన్మోహన్ రెడ్డి దిగ్గజ కాపు నేతల కుటుంబాలను తన వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆమె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది.కాపులు అంటే ముందుగా గుర్తొచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. ఎందుకంటే ఆయన రాజకీయ నాయకుడిగానే కాకుండా కాపు రిజర్వేషన్ ఉద్యమ నేతగా గుర్తింపు పొందారు. కాపులకు రాజకీయంగా ప్రాతినిధ్యం దక్కడంతో పాటు రిజర్వేషన్లు సైతం కల్పించాలని పోరాడారు. ఈ క్రమంలో ఆయన పోరాటం పక్కకు వెళ్ళింది. ఇప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి గా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ప్రకటించారు. అయితే కాపుల్లో ముద్రగడ పద్మనాభం ప్రభావం క్రమేపి తగ్గింది అన్నది వాస్తవం. ఎందుకంటే 2024 ఎన్నికల్లో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడమే కాదు.. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. పవన్ ఓడిపోకుంటే తాను పేరు మార్చుకుంటానని కూడా ప్రకటించారు. వైసీపీ దారుణంగా ఓడిపోవడంతో తన పేరు మార్చుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో రాజకీయా ల్లో యాక్టివ్ తగ్గించారు.అయితే ముద్రగడ ప్రయోగం విఫలం కావడంతో జగన్మోహన్ రెడ్డిపునరాలోచనలో పడ్డారు. టిడిపిలో ఉన్న వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నించాడు. అవి వర్క్ అవుట్ కాకపోయేసరికి మోహన్ రంగ కుమార్తె ఆశాకిరణ్ వైపు చూసినట్లు తెలుస్తోంది. రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ సీటును కానీ.. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడున్న పరిస్థి తుల్లో వంగవీటి కుటుంబ అవసరం జగన్మోహన్ రెడ్డికి ఉంది. అందుకే ఈ ఓపెన్



ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతానికి రంగా రాధా మిత్రమండలి ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి.. 2029 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరాలని అంగీకారం కుదిరినట్లు సమాచారం.ఇప్పుడున్న పరిస్థితుల్లో కాపు సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి చాలా అవసరం. ఎందుకంటే కాపులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ను తమ ఐకానిక్ లీడర్ గా భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ లో తమ సామాజిక వర్గ విజయాన్ని చూసుకుంటున్నారు. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ పాలనలో తమకు ఎదురైన పరిణామాలు కాపు సామాజిక వర్గానికి తెలుసు. అందుకే జగన్ ప్రయత్నాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. ఇప్పుడు కానీ వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశాకిరణ్ వైసీపీలో చేరితే మాత్రం అది కుటుంబాన్ని చీల్చినట్టే. వంగవీటి కుటుంబాన్ని చీల్చడం ద్వారా కొత్త విమర్శను ఆయన ఎదుర్కోవడం ఖాయం. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

## అందానికి గంధం!




మెండైన ఔషధ గుణాలు కలిగిన గంధం.. సౌందర్య సంరక్షణలోనూ ముందుంటుంది. మేని ఛాయను మెరుగుపరుస్తుంది. చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో యాంటి ఇన్ఫ్లమేటరీ, యాంటి బ్యాక్టీరియల్, యాంటి మైక్రోబయల్, యాంటి ప్రొలిఫెరేటివ్, యాంటి వైరల్ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ చర్మ సంరక్షణలో సాయపడుతాయి. పొడి చర్మాన్ని నివారించడంలో గంధం అద్భుతంగా పనిచేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ పాలపొడిలో కొన్ని చుక్కల గంధం నూనె, రోజ్ వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖాని కి రాసుకొని.. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. గంధంలోని సుగుణాలు.. చర్మానికి తేమను తెస్తాయి. ఒక టీస్పూన్ గంధం నూనెలో చిటికెడు పసుపు, చిటికెడు కర్పూరం కలపాలి. ఈ మిశ్రమాన్ని ఫేస్‌ప్యాక్‌లా రాసుకోవాలి. రాత్రంతా అలాగే ఉంచి.. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే మొటిమలు, నల్లమచ్చలు తొలగిపోతాయి. గంధంలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు.. ఫ్రీరాడికల్స్ వల్లచర్మానికి కలిగే నష్టాన్ని నివారి స్తాయి. ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టికి, మరో రెండు టేబుల్ స్పూన్ల గంధం కలపాలి. కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి.. ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. 15 నిమిషాలు అలాగే ఉంచి.. చల్లని నీటితో కడిగితే చాలు. ముఖంపై ముడతలు, గీతలు తగ్గిపోయి.. చర్మం మృదువుగా మారుతుంది. చర్మంలో పేరుకున్న మలినాలు తొలగిపోవ డంతోపాటు స్కిన్‌టోన్ మెరుగుపడుతుంది. ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణా లు కలిగిన గంధం.. చర్మంపై నల్ల మచ్చలను పోగొడుతుంది. ట్యాన్ తొలగించడంలోనూ సాయపడుతుంది. ఒక టేబుల్ స్పూన్ గంధం పొడికి కొద్దిగా కొబ్బరి నూనె కలపాలి. దీన్ని ముఖానికి రాసుకొని, సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా అలాగే ఉంచేసి, ఉదయాన్నే గోరువెచ్చటి నీటితో కడిగేస్తే.. ముఖం తళతళ మెరుస్తుంది.

## బాధ్యతలు స్వీకరణ


కమాన్ పూర్: కమాన్ పూర్ గ్రామ కార్యదర్శిగా అల్వాల మారుతి బాధ్యతలను స్వీకరించా రు. ఇక్కడ పనిచేసిన ఝాన్సీని రొంపిగుంట గ్రామానికి కార్యదర్శిగా బదిలీ చేశారు.
దీంతో ఇన్చార్జి ఎంపిఓ గా ఉన్న మారుతిని కమాన్ పూర్ గ్రామ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య మారుతిని కమాన్ పూర్ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.
దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది మీడగొని శ్రీనివాస్, సాగర్ల నరేష్, దుర్గం రాజు, మంగ సంతోష్, భూదేవి తదితరులు స్వీట్ తినిపించి శాలువతో సత్కరించారు.

# కథలు చదవని మనుషులు




అవి నా చిన్నప్పటి రోజులు. నేను ఐదో తరగతి చదువుతున్నాను. మా ఇంటి పక్కన ఒక పెద్దమనిషి ఉండేవాడు. ఆయన్ను అందరూ "కథల బాబారు" అని పిలిచేవారు. పిల్లల్ని చుట్టూ కూర్చుండబెట్టుకొని కథలు చెబుతూ ఉండేవాడు. చెప్పిన కథ చెప్పకుండా చెపుతూ ఉ ంటే ఎంతో ఆసక్తిగా వినేవాళ్లం. కథలో ఉండే విషయం కన్నా ఆయన చెప్పే తీరుకు మేము ఎక్కువ ఆకర్షితులమయ్యాం అని చెప్పవచ్చు. అప్పుడప్పుడు మాకు ఒక విషయం చెప్పేవాడు. 'మీరు పాఠాలు చదవకపోయినా పర్వాలేదు. కథలు మాత్రం తప్పక చదవండి. కథలు చదివినవాళ్లు మంచి మనుషులు అవుతారు' అని చెప్పేవాడు. నేను పదవ తరగతిలో ఉండగా కథల బాబారు ఏదో జబ్బుతో కన్నుమూశా డు. ఊరి జనమంతా కన్నీరు మున్నీరై విలపించారు. మన పిల్లలకూ మనకూ ఇంక ఎవరు కథలు చెబుతారంటూ దిగులు పడ్డారు.
ఆ చిన్న వయస్సులో కథలు వింటూ పెరిగిన నేను కథల పుస్తకాలు తెగ చదివేవాడిని. క్రమక్రమంగా నవలలు, పురాణాలు శాస్త్ర గ్రంథా లు చదవడం అలవాటయింది. 50 సంవత్సరాల కిందట కథల బాబారు చెప్పిన మాటలు అప్పుడప్పుడు గుర్తుకు వస్తూ ఉంటాయి. కథలు చదవకుండా పుస్తకాలు చదవకుండా డిగ్రీలు సంపాదించుకొని బయటకు వస్తున్న వీళ్లంతా మంచివాళ్లు కాదా? ఏమో ఆనాడు కథల బాబారు చెప్పిన మాటలు నిజమేమో అనిపిస్తూ ఉంది.
కథల్లో ఏముంది? కథా సాహిత్యం మనుషుల్ని ఇంతగా ఎందుకు ఆకర్షిస్తుంది? కథ కూడా అద్దం లాంటిదే. మనిషి అద్దంలో తన ముఖం చూసుకొన్నట్లు కథలో తనను వెదుక్కొంటాడు. తన అభిప్రాయాలు, బాధలు, మంచీచెడుల గురించి తెలుసుకొంటూ వుంటాడు. కథల్లో, కావ్యాల్లో, నవలల్లో అన్నింటిలో మనుషులే ఉ ంటారు. కథల్లో ఇతర జీవులు, ప్రాణంలేని బండరాళ్లు మనిషిలానే మాట్లాడతాయి. అణువణువులో మనిషి తననే వెదుక్కొంటాడు.
పుస్తకాలు చదివేవాళ్లు వంద మంది ఉన్నారనుకొంటే అందులో తొంభై మంది కథల పుస్తకాలే చదువుతుంటారు. మిగిలిన పది శాతం ఇతర పుస్తకాలు చదువుతుంటారు.
కథలు చదివేవాళ్లు జాతి, కుల, మత భేదాలు లేకుండా ఒకేలా స్పందిస్తారు. అందరూ సినిమాలకు వెళతారు. సినిమా చూసే ప్రేక్షకుల్లో ధనికులూ, పేదలూ ఉంటారు. మంచివారూ, చెడ్డవాళ్లు ఉంటారు. అందరూ ఒకేలా స్పందిస్తూ ఉంటారు. ముగింపులో చెడు ఓడిపోయి మంచి గెలుస్తుంది. ఎవ్వరూ చెడు గెలవాలని కోరుకోరు. కాని నిజ జీవితంలో బలహీనుడి వైపు ఎంత న్యాయమున్నా గెలవడు. బలవంతులు, ధనవంతులు, అధికారం ఉన్నవాళ్లు ఈ ప్రపంచంలో గెలుస్తూ ఉన్నారు. కాని కథల్లో మాత్రం ఓడిపోవాల్సిందే. ఇది మానవ జాతి ఆకాంక్ష, కోరిక, ఆశయం. ఈ ఆకాంక్షను మానవజాతి ఏదో ఒక రోజు నెరవేర్చుకొంటుంది. అయితే మనుషులు ఈ ఆకాంక్షతో జీవించాలంటే అది కథా సాహిత్యం ద్వారానే సాధ్యం. మరింత బలంగా పురికొల్పబడుతూ ఉండాలి. ఇందుకే పిల్లలు కథలు వింటూ కథలు చదువుతూ పెరగాలి.
కథా సాహిత్యం చదవకుండా పాఠ్యేతర పుస్తకాలు చదవకుండా పైకి వచ్చిన వారికి మనుషులు మనుషుల్లా కనిపించరు. డాక్టర్లకు పేషంట్లుగా, లాయర్లకు క్లయింట్లుగా, రాజకీయ నాయకులకు ఓటర్లుగా, వ్యాపారులకు కష్టమర్లుగా మాత్రమే కన్పిస్తారు. వీళ్లంతా ప్రకృతి నుండి, మనిషి నుండి ఎంత పిండుకోవాలో అంత పిండుకోడానికే చూస్తారు.
మానవ జాతిని సమాజ అభివృద్ధిని శాస్త్రీయంగా అర్థం చేసుకోకపోతే, తాలిబన్ల వంటి ఉగ్రవాదులు పుడుతూనే ఉంటారు. ప్రకృతిని ఇతర జీవజాతులను అర్థం చేసుకోలేకపోతే కరోనా లాంటి భూతాలు పుడుతూనే ఉంటాయి. అంతులేని లాభాపేక్షతో వ్యాపారులు, ఆశబోతులు ప్రకృతి నుండి మరింత పిండుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటే కరోనా కంటే ప్రమాదకరమైన జీవులు పుట్టి మానవజాతి అంతుచూస్తాయి. ఈ భూగోళం పచ్చగా పరిశుభ్రంగా జీవంతో కళకళలాడుతూ ఉండాలంటే మనిషి మారాలి. మనుషులు మంచి వాళ్లుగా ఆలోచనాపరులుగా మారాలి. ఇది ఒక్క కథాసాహిత్యం ద్వారానే సాధ్యం. మనుషుల ఊహలకు, కల్పనలకు, ఆకాంక్షలకు ఊపిరి పోసేవే కథలు. కథల్లో ఉన్న కల్పనలు-శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాస్త్రాల ద్వారా వాస్తవం చేసుకొంటాడు మనిషి. ఊహలకు, కల్పనలకు ఊపిరి పోసే కథలు చదవకుండా మన విద్యార్థులకు శాస్త్రజ్ఞానం ఎలా అబ్బుతుంది? శాస్త్రజ్ఞులకు మానవతా విలువలు ఎక్కడ నుండి వస్తాయి?
మనిషి కథల గుర్రాన్ని ఎక్కి స్వారీ చేసుకొంటూ సైన్సు అనే మాయా మందిరంలోకి ప్రవేశించాలి. అప్పుడు మాత్రమే తన మానవ రూపాన్ని నిలబెట్టుకొంటాడు. లేకపోతే ఏ భూతంగానో క్రూర మృగంగానో మారిపోయి బయటకు వస్తాడు.
ఒకప్పుడు శాస్త్రాన్ని కూడా కలిపి అంతా సాహిత్యంగానే చదువుకొన్నారు. ఆధునిక కాలంలో శాస్త్రం సాహిత్యం నుండి విడగొట్టుకొన్నది. అయినా చదువుల్లో భాషా సాహిత్యాలకు, విజ్ఞాన శాస్త్రాలకు సమప్రాధాన్యతనిచ్చి చదువుకొన్నాం. ఇప్పుడు భాషా సాహిత్యాలను పక్కనబెట్టి శాస్త్రజ్ఞానం చాలు అన్నట్లుగా చదువులు సాగుతున్నాయి. ఈ చదువుల పుణ్యమే మాతృభాషల ప్రాధాన్యతలను అర్థంచేసుకోలేని మేధావులు తయారయ్యారు. ఊహలు, కల్పనలు, స్పందనలు లేని కొత్తరకపు మానవజాతి ఈ భూగోళం మీద అవతరిస్తుంది. ఈ కొత్త రకపు మానవజాతి పుట్టింది ఈ చదువుల ద్వారా ఈ బడుల ద్వారానే. ఇది నమ్మలేని నిజం.
బాల్యంలో కథా సాహిత్యం చదవకపోవడం, పాఠ్యేతర పుస్తకాలు చదవకపోవడమనే చిన్న కారణంతో బడిమీద, ఈ నాటి చదువుల మీద ఇంత పెద్ద నిందవేయడం సబబేనా?
చిన్న మేకు టైరులో దిగితే గాలిపోయి బండి బోల్తా కొడుతుంది. బోల్టు చాలా చిన్నగా కనిపించవచ్చు. అది ఊడిపోతే ఎంత పెద్ద యంత్రమైనా ఆగిపోతుంది. కథలు చదవకపోవడం పుస్తకాలు చదవకపోవడం చిన్న కారణమా? మనిషి గుండెల్ని తట్టి లేపేవి పుస్తకాలు. పుస్తకాలు మనతో మాట్లాడతాయి. పుస్తకానికి పాఠకుడికి మధ్య ఎవ్వరూ ఉండరు. ఏకాంతంలో పుస్తకాలు చదువుతూ స్పందిస్తూ ఉన్నప్పుడే మనిషిలో మార్పు జరుగుతూ ఉంటుంది. మంచి భావనలు నాటుకొంటూ ఉంటాయి. ఇక్కడ పరీక్షలు, మార్కుల గొడవ ఉండదు. గుర్తుపెట్టుకోవాలనే బాధ ఉండదు. ఇష్టపూర్వకంగా ఆనందంగా ఆసక్తిగా చదివే పుస్తకాలే మనిషిని మానవతా సింహాసనం పై కూర్చుండబెడతాయి. మహనీయులుగా మారుస్తాయి. 'మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అని అడిగితే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పుస్తకం అని చెబుతాను' అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. 'తుపాకీ కంటే గొప్ప ఆయుధం పుస్తకం' అన్నాడు లెనిన్. 'శారీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎలా అవసరమో మానసిక ఆరోగ్యానికి పుస్తక పఠనం అంతే అవసరం' అన్నాడు మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్. 'నాకు కోటి రూపాయిలిస్తే ముందు గ్రంథాలయాన్ని పెడతాన'న్నాడు గాంధి. 'ఒక పిల్లవాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి పుస్తకమే'నంటాడు విన్‌స్టన్ రస్సెల్. ప్రపంచాన్ని తిరిగి చూడాలన్నా, భూత భవిష్యత్తు కాలాల్ని దర్శించాలనుకొన్నా ముందు గ్రంథాలయమనే జ్ఞాన మందిరాన్ని సందర్శించాలి.

# భూమిని బట్టే దిగుబడి



పెరటి తోటల్లో పండ్ల మొక్కలు పెంచుకోవడానికి చాలామంది ఆసక్తి చూపుతారు. నచ్చిన మొక్కను తీసుకొచ్చి నాటుతారు. అయితే, ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా.. కొన్ని మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఎత్తు పెరిగినా.. దిగుబడి మాత్రం కనిపించదు. ఇందుకు కారణం.. భూమిలో ఉండే సమస్యలే! పండ్ల మొక్కలు ఏపుగా, దృఢంగా పెరిగినప్పుడే దీర్ఘకాలం దిగుబడిఇస్తాయి. అందుకోసం మొక్కల్లో పొడవైన, బలమైన వేరు వ్యవస్థ ఉండాలి. అందుకు అనువైన భూమి ఉన్నప్పుడే.. వేరు వ్యవస్థ బలంగా తయారవుతుంది. లేకుంటే మొక్కల్లో ఎదుగుదల, దిగుబడి కూడా తగ్గుతుంది. అలా కాకుండా ఉ ండాలంటే.. పండ్ల మొక్కల పెంపకానికి ముందే భూపరీక్షలు చేయించాలి. నేల లోతు, రకాన్ని బట్టి అనువైన పండ్ల మొక్కలను ఎన్నుకోవాలి. మొక్కల వేరువ్యవస్థకు ఆటంకం కలిగించని నేలల్లో పండ్ల మొక్కలు బాగా పెరుగుతాయి. ఇక భూమిలో సున్నపు పొరలు ఉంటే పండ్ల మొక్కల వేర్లు సరిగాపెరగవు. భూమిలో సున్నం అధికంగా ఉంటే, మొక్కల పెరుగుదలకు అవసరమైన ఇనుము, మాంగనీసు వంటి సూక్ష్మపోషకాలు అందకుండా పోతాయి. దాంతో, వాటి ఎదుగుదల తగ్గిపోయి, మొక్కలు బలహీనంగా తయారవుతాయి. కాబట్టి, పండ్ల మొక్కల పెంపకానికి ఎంచుకున్న పెరటిలో సున్నపు పొరలు లేకుండా చూసుకోవాలి. అంతేకాకుండా.. నీరు సులభంగా ఇంకిపోయే ఎర్రగరప నేలలు, ఒండ్రు భూములు పండ్ల మొక్కల పెంపకానికి చాలా అనుకూలంగా ఉంటాయి. నీరు సరిగా ఇంకని బరువైన బంక భూములు అంత అనుకూలంగా ఉండవు. ఇక నేల లోతును బట్టి కూడా మొక్కల ఎంపిక ఉంటుంది. 90 సెం.మీ. మించి ఉంటే.. మామిడి, సపోట, పనస, నేరేడు లాంటి మొక్కలు పెంచుకోవచ్చు. 60-90 సెం.మీ మధ్యలో ఉంటే.. జామ, దానిమ్మ, రేగు, నిమ్మ, ఉసిరికి అనుకూలంగా ఉంటుంది. అదే.. 45-60 సెం.మీ ఉంటే.. అరటి, బొప్పాయి, సీతాఫలం లాంటివి మంచి దిగుబడిని అందిస్తాయి. కాబట్టి, నేల రకాన్ని బట్టి పండ్ల మొక్కలను ఎంపిక చేసకోవాలి. ఈ విషయంలో రాజీపడితే.. కేవలం రెండుమూ డేళ్లలోనే మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుంది.

# ఎనర్జీ కాదు.. ఎలర్జీ!



అలసటగా ఉన్నప్పుడు కొందరు ఎనర్జీ డ్రింక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. వాటిని తాగి, తక్షణ చురుకుదనం పొందుతారు. అయితే, ఈ అలవాటు ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు ఉన్నవారిలో ఆరోగ్య సమస్యలు మరింత పెంచుతుందని హెచ్చరిస్తున్నారు. ఎనర్జీ డ్రింక్స్ తాత్కాలికంగా శక్తిని, చురుకుదనాన్ని పెంచుతాయి. అదే సమయంలో గుండె ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ఇదే విషయాన్ని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ చెబుతున్నది. ఎందుకంటే.. చాలారకాల ఎనర్జీ డ్రింక్స్‌లలో కెఫిన్ స్థాయిలు అధికంగా ఉంటాయి. ఇతర సమ్మేళనాలతో కలిసి.. హృదయ స్పందన రేటుపై ప్రభావం చూపుతాయి. రక్తపోటు పెరుగుదలకూ దారితీస్తాయి. గుండె లయకు అంతరాయం కలిగించడంతోపాటు గుండెను ఒత్తిడికి గురిచేస్తాయి. గుండె కణాల పనితీరునూ మార్చేస్తాయి.
ఇక ఎనర్జీ డ్రింక్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు అధికమయ్యే అవకాశం ఉన్నదని పలు అధ్యయనాలు తేల్చాయి కూడా. సాధారణంగా రోజుకు 400 మిల్లీగ్రాముల కంటే తక్కువ కెఫిన్ తీసుకోవాలని నిపుణులు సిఫారసు చేస్తున్నారు. అంటే, దాదాపు నాలుగు చిన్న కప్పుల కాఫీ సరిపోతుందని అంటున్నారు. గుండె సమస్యలు ఉన్నవారు ఎనర్జీ డ్రింక్స్‌ను పూర్తిగా నివారించాలని సూచిస్తున్నారు. ఎనర్జీ డ్రింక్‌లోని పదార్థాలను అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమే. తద్వారా మీ ఆరోగ్యానికి అనుకూలమైన డ్రింక్స్‌ను ఎంచుకోవచ్చు. ఇక కార్బొనేటెడ్ ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా.. ఆరోగ్యకరమైన వాటిని తీసుకోవచ్చు. తగినంత నిద్రపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తినడంతోపాటు నిత్యం హైడ్రేటెడ్‌గా ఉ ండటం వల్ల కొత్త శక్తిని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# నోరూరించే కుకీలు



చిరు ధాన్యాలు నిజంగా సిరి ధాన్యాలే. మన ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అలాంటి చిరుధాన్యాలతో రకరకాల పదార్థాలు వండుకోవచ్చు. పిల్లలు ఇష్టంగా తినే కుకీలను ఆరోగ్యకరంగా తయారు చేసుకోవచ్చు. ఇకడ మైదా పిండికి బదులు ఊదల పిండి, పంచదారకు బదులు పటిక బెల్లం పొడినీ వాడవచ్చు. ఇలా చేసిన కుకీలు రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం అందిస్తాయి. మరి.. ఈ టేస్టీ కుకీలను ఎలా చేయాలో తెలుసుకుందాం..
కావలసిన పదార్థాలు, గోధుమ పిండి : ఒక కప్పు, ఊదల పిండి : ముప్పావు కప్పు, పటిక బెల్లం పొడి : ముప్పావు కప్పు, వెన్న : 100 గ్రా., షుగర్ గ్లేజ్/ గార్నిష్ కోసం.. పటిక బెల్లం పొడి : అరకప్పు, పీనట్ బటర్, చాకొలెట్ గనాష్, కలర్‌ఫుల్ స్ప్రింక్లర్స్ :కొద్దికొద్దిగా..
తయారీ విధానం: ఒక లోతైన గిన్నెలో పటిక బెల్లం పొడిని జల్లెడ పట్టుకోవాలి. వెన్న వేసి బాగా కలపాలి. అందులోనే జల్లెడ పట్టిన గోధుమపిండి, ఊదల పిండి వేసి.. పదార్థాలన్నిటినీ బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని 30 నిమిషాలపాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తరువాత పిండిని మరోసారి కలిపి.. వెడల్పాటి ప్లేట్‌లో వేసి, అప్పడాల కర్రతో దగ్గరికి ఒత్తుకోవాలి. దానిని కుకీల ఆకారంలో కట్ చేసుకోవాలి. ప్రీహీట్ చేసిన ఓవెన్‌లో పెట్టి.. 170 డిగ్రీల సెల్సియస్ వద్ద 20 25 నిమిషాలు కాల్చుకోవాలి. ప్రతి పది నిమిషాలకు ఒకసారి చెక్ చేసుకుంటూ ఉండాలి. బేకింగ్ అయిపోయిన తరువాత కుకీలను పూర్తిగా చల్లారనివ్వాలి. ఆ తరువాత పీనట్ బటర్, షుగర్ గ్లేజ్, స్ప్రింక్లర్స్, డార్ చాకొలెట్ గనాష్‌తో డెకరేట్ చేసుకుంటే.. రుచికరమైన కుకీలు సిద్ధమైపోయినట్లే! మిల్లెట్స్‌తో చేసిన ఈ కుకీలను ఆ రోజే తినడం మంచిది. పిల్లలకు పాలతో పాటు కలిపి ఇస్తే.. మరీ ఇష్టంగా తింటారు.



## అక్రమ మద్యంపై ఎక్సైజ్ శాఖ నిఘా


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 9 నుండి నామినేషన్లు స్వీకరిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు తెలంగాణ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం రాకుండా ప్రత్యేక నిఘా పెట్టింది. మద్యం దుకాణదారులకు నియమావళిపై అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగింది. మొత్తం ఐదు దశల్లో ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రెడీ అయ్యింది. ఈ నెల అనగా అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నగదు, మద్యం రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అబ్కారీ శాఖ కీలక ప్రకటన చేసింది.. తెలంగాణలో సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో అబ్కారీ శాఖ అలర్ట్ అయ్యింది. రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు రచిస్తున్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల నుండి తెలంగాణలో అక్రమం గా మద్యం ప్రవేశించకుండా చూడటం కోసం సరిహద్దుల్లో ఉన్న అన్ని తపాలా, పోలీస్, ఎక్సైజ్ స్టేషన్లను అలర్ట్ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోఉన్న 34 ఎక్సైజ్ జిల్లాల పరిధిలోని.. 139 పోలీస్ స్టేషన్లలో గుడుంబా తయారీ, అమ్మకం, సరఫరా మీద ప్రత్యేక నిఘా పెట్టారు. దీంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ కు నల్లబెల్లం మద్యం, ఇతర అక్రమ మద్యం రాకుండా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# కళ్లను ప్రేమిద్దాం




"సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు. కళ్లు మన ముఖానికి ఆభరణాలు. కళ్ల అందాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించని కవులు వుండరంటే అతిశయోక్తి కాదేమో. 'మెరిసే తారలదే రూపం / విరిసే పువ్వులదే రూపం/ అది నా కంటికి శూన్యం/ మనసున కొలువై/ మమతల నెలవై వెలసిన దేవిది ఏ రూపం/ అది నా కంటికి శూన్యం' అంటారు 'సిరివెన్నెల'. ప్రకృతి, పువ్వులు, తారలు, ప్రేయసీ%ూ% ఇవేకాదు.. మనిషికి నచ్చేవి, మనసు మెచ్చేవి కంటి నిండా దర్శించి, మది నిండా నింపుకోవాలంటే, వాటిని చూడగలిగే దృష్టి వుండాలి. ఆ కళ్లు ఆరోగ్యంగా వుండాలి. కళ్లు ఎంత ఆరోగ్యంగా వుంటే, ఆ మనిషి అంతే ఆరోగ్యంగా వుంటారు. అందుకే వాటిని కాపాడుకోవడం మన విధి. చాలా మంది కళ్ల విషయంలో అజాగ్రత్తగా వుంటారు. కళ్లు తెరిచిన దగ్గర నుంచి తిరిగి మూసేవరకు మనకు నిత్యం కళ్లతోనే పని. మనకు గుండె ఎంత ముఖ్యమో. కళ్లు కూడా అంతే ముఖ్యమని గుర్తుంచుకోవాలి' అంటారు ఆప్తమాలజిస్ట్ సారా మాలింగ్. మనం బాగా పరిగెత్తినప్పుడు గుండె కొట్టుకునే వేగం కూడా పెరుగుతుంది. ఆ సమయంలో పరుగు ఆపి, కాస్త విరామం తీసుకుంటాం. కానీ, కళ్ల దగ్గరకొచ్చేసరికి ఇలాంటి సడలింపులేమీ వుండవు. ఎలాంటి విరామం లేకుండా పనిచేస్తూనే వుంటాయి. ప్రస్తుతం కళ్లపై మరింత భారం, ఒత్తిడి పెరిగింది. చదువుకునే పిల్లలు ప్రింట్ మాధ్యమాల నుంచి దృశ్య (స్క్రీన్) మాధ్యమాల వైపు మారిపోతున్నారు. ఈ ప్రభావం దృష్టి లోపానికి దారి తీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 220 కోట్ల మంది ప్రజలు ఏదో ఒక రకమైన దృష్టి లోపంతో బాధపడుతున్నారని, 2040 వాటికి మన పిల్లల్లో 50 శాతం పైగా కళ్లద్దాలు ధరించాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఒక అంచనా. ఆధునిక జీవనశైలి మనిషి చుట్టూ అల్లుకున్న సాలెగూడులా మారింది. కుటుంబం, కెరీర్, అభివృద్ధి వంటివి మనిషి జీవన శైలిని పూర్తిగా మార్చేశాయి. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, టాబ్లెట్లు మన రోజువారీ జీవితాల్లో అంతర్భాగమయ్యాయి. ఉద్యోగాలు ఎక్కువగా డిజిటల్ మాధ్యమాలపై ఆధారపడటం, పిల్లల నుంచి పెద్దల వరకూ గంటల తరబడి స్క్రీన్ల ముందే గడపడం ఇప్పుడు కామన్ అయింది. దీని మూలంగా దృష్టి లోపాలు, కళ్లు పొడివారడం, మయోపియా వంటి కంటి సమస్యలు వృద్ధి చెందుతున్నాయి. ఆధునిక జీవనశైలితో ముడిపడిన పిల్లల్లో మయోపియా కేసులు ప్రపంచవ్యాప్తంగా రెట్టింపు అయినట్లు ఇటీవల ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన హెచ్చరిస్తోంది.ప్రకృతితో మమేకంకావడం తగ్గడం, నిత్యం వర్క్ ఫ్రమ్ హోమ్, స్క్రీన్ టైమ్ పెరగడం, శారీరక చలనం తగ్గిపోవడం వంటి అంశాలు కంటి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడమేగాక చిన్న వయసులోనే అంధత్వం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏడాది అక్టోబర్ రెండో గురువారం 'ప్రపంచ దృష్టి దినోత్సవం' జరుపుకుంటు న్నారు. కంటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, అంధత్వాన్ని నివారించ డంపై అవగాహన కల్పించడంలోభాగంగా ఒక్కో ఏడాది ఒక్కో థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. గతేడాది 'మీ కళ్లను ప్రేమించండి' అన్న థీమ్ ప్రతి మనిషిలో కంటి ఆరోగ్యంపై మక్కువ పెంచాలని పిలుపునిచ్చింది. 'కళ్లు మనసుకు అద్దం లాంటివి' అంటారు షేక్‌స్పియర్, మన జీవితంలో 80 శాతం సమాచారాన్ని కళ్ల ద్వారానే గ్రహిస్తామట. ఎవరైనా చూపు కోల్పోయినప్పుడు, అది వారి జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది. కళ్లను ప్రేమించడం అంటే, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం, వాటికి అవసరమైణ రక్షణ ఇవ్వడం. పిల్లలైనా, పెద్దలైనా సాధ్యమైనంత వరకూ డిజిటల్ స్క్రీన్లకు దూరంగా వుండాలి. అంతేకాదు. ప్రతి ఏడాది కార్యాలయాల్లో 350 లక్షల కంటి గాయాలు సంభవిస్తున్నాయని అంచనా. అన్ని అంధత్వ కేసుల్లో.. 90 శాతం అంధత్వాన్ని ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చు లేదా చికిత్స చేయవచ్చు. చిన్న సమస్యే కదా అని నిర్లక్ష్యం చేస్తే.. అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం వుంది. ఇక్కడ అవగాహన కీలక పాత్ర పోషిస్తుంది. 'మీరు ఎక్కువగా మనిషి కంటే మెషీన్లకే సమయం కేటాయిసే.. క్రియేటివిటీని కోల్పోతారు' అంటారు యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. ఉద్యోగపు ఒత్తిడిలో,డిజిటల్ స్క్రీన్లు, రేడియేషన్ల మధ్య ఆధునిక జీవనశైలికి తలొగ్గినా.. కంటిచూపును ఆరోగ్యంగా వుంచుకోవాలి. మన కళ్లను మనం ప్రేమించాలి. ఇది ప్రపంచ దృష్టి దినోత్సవ సందేశం.

## మారనున్న ఆ 26 రోడ్లు



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** విశాఖపట్నంలో రోడ్ల సదుపాయాలను మెరుగు పరిచే దిశగా వీఎంఆర్డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.174కోట్లతో ఏడు రహదారులను నిర్మించనుంది. ఈ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపగా.. వీఎంఆర్డీఏ టెండర్లను కూడా ఖరారు చేసింది. తాజాగా పనులు ప్రారంభించేందుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ రహదారులను భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే జాతీయ రహదారి మీద ఒత్తిడిని తగ్గించేందుకు నిర్మించనున్నారు.విశాఖపట్నంలో రహదారి మౌలిక సదుపాయాలకు సంబంధించి కీలకమైన అడుగు పడింది. రూ.174 కోట్లతో ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ టెండర్లను ఖరారు చేయటంతో పాటుగా నిర్మాణ పనులను ప్రారంభించింది. 27 కిలోమీటర్ల మేరకు ఈ రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే జాతీయ రహదారిపై ప్రయాణీకుల రద్దీని సులభతరం చేసేందుకు ఈ రోడ్లను నిర్మించనున్నారు. భోగాపురం చుట్టుపక్కల ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, గంభీరం, అడవివరం-సోంత్యం వంటి ప్రాంతాలలో ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. వీఎంఆర్డీఏ , జీవీఎంసీ, రోడ్లు, భవనాల విభాగం సంయుక్తంగా ప్రతిపాదించిన 15 రోడ్లలో.. ఈ మేరకు ఏడు రోడ్లకు ప్రభుత్వం నుండి ఆమోదం లభించింది. వీటి పనులకు వీఎంఆర్డీఏ టెండర్లను ఖరారు చేసింది. 2024లో విశాఖపట్నంలో జరిగిన సమీక్షా సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కనెక్టింగ్ మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధికి అనుగుణంగా కనెక్టివిటీని మెరుగుపరచాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం, ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం ఆమోదించింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా వీఎంఆర్డీఏ విశాఖపట్నంను అభివృద్ధి చేస్తుందని ఎఓఖీఅం చైర్మన్ ఎం. ప్రణవ్ గోపాల్ ఇటీవల వెల్లడించారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు కీలకమైన రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు ఈ ఏడు రోడ్లు త్వరలో అందుబాటులోకి రాబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానించే జాతీయ రహదారి మీద ప్రయాణ ఒత్తిడిని తగ్గించే ముఖ్యమైన మార్గాలు. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరగా చేరుకోవడానికి ప్రయాణికులకు ఉపయోగపడతాయని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఈ ఏడు రోడ్లను ఒకే ప్యాకేజీ కింద పూర్తిచేయాలని వీఎంఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. వీటి వ్యయం రూ. 100 కోట్లు దాటిన నేపథ్యంలోఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్' కాంట్రాక్ట్ మోడల్ కింద ఏడు రోడ్లకు టెండర్లను ఒకే టెండర్‌గా పిలిచారు. తాజాగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు , వీఎంఆర్డీఏ అధికారులు సింహాచలం సమీపంలోని అడవివరం ప్రాంతంలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు.అడవివరం - గండిగుండం.. చిప్పాడ - పోలిపిల్లి.. నేరెళ్లవలస - తాళ్లవలస.. బోయపాలెం - మంగమారిపేట.. పరదేశిపాలెం - గంభీరం.. శివశక్తి నగర్ - ఉడా హరిత ప్రాజెక్టు.. గంభీరం - హైవే.. వరకు 26 కిలో మీటర్ల మేరకు ఈ రహదారులను నిర్మించనున్నారు. ఇక రహదారుల నిర్మాణంలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోయేవారికి టీడీఆర్ లు ఇస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. నిర్ణీత గడువులోగా ఈ రోడ్లు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## సంక్షేమ పథకాలు కలిసొస్తాయా

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గట్టెక్కిస్తాయని భావిస్తున్నట్లుంది. అందుకే ఆయన పదే పదే సంక్షేమం పదాన్ని వల్లె వేస్తున్నారు. అభివృద్ధి అన్న మాట కంటే ఎక్కువగా సంక్షేమం అనే పదమే ఎక్కువ సార్లు ఆయన నోట వినిపిస్తుంది. గత పదిహేను నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు, ఆటో డ్రైవర్లకు పదిహేను వేల రూపాయలు వంటి పథకాలను అమలు చేశారు. వీటితో పాటు తల్లికి వందనంతో పాటు అన్నదాతకు అండగా నిలుస్తూ అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారు. సంక్షేమం విషయంలో చంద్రబాబు ను ఎవరూ తప్పుపట్ట లేరు. గత మూడు దఫాలుగా... నిజానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు సంక్షేమం అమలు చేసిన దానికంటే ఎక్కువగా ఈ టర్మ్ లో అమలు చేసి చూపుతున్నారు. గతంలో మూడు దఫాలు ఆయన విజన్ తో పనిచేసేవారు. సంక్షేమం అనేది ఆయనకు లీస్ట్ ప్రయారిటీగా ఉండేది. రాష్ట్ర భవిష్యత్ అంటూ సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు. కానీ ఈసారి మాత్రం చంద్ర బాబు నాయుడు అందుకు భిన్నంగా కనిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షే మాన్ని కూడా పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడంతా సంక్షేమ మంత్ర మే ఆయన నోటి నుంచి వినిపిస్తుండటం ఒకింత పార్టీ నేతలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు నాయుడు తన పై ఉన్న అపవా దును చెరిపేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయరు అన్న వారి నోళ్లను మూయించడానికే సంక్షేమాన్ని భారమైనా భుజానకెత్తుకున్నారంటున్నారు.అయితే సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే రెండోసారి విజయం సాధించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ అనేక సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడి గా అమలు చేసిన కేసీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు.

## మాగుడు గడ్డితో ఉపాధి, ఆదాయం

**అనంతపురం,తెలంగాణ దిశ :** మాగుడు గడ్డి కొరతతో సతమతమైన ఇద్దరు రైతులు, ఉమామహేష్, నజీర్‌లు ప్రభుత్వ రాయితీతో మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. ఇది విజయవంతంగా నడుస్తూ, తమ అవసరాలు తీర్చడమే కాకుండా 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుండి భారీ డిమాండ్ ఉంది. ఈ కేంద్రం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతూ, కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు. ఇద్దరు రైతులు తమ పొట్టేళ్లకు మేతకు మాగుడు గడ్డి కోసం ఇబ్బందిపడ్డారు. ఇతర ప్రాంతాల్లో గడ్డి కోసం తిప్పలుపడ్డారు. అప్పుడు స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో, ప్రభుత్వ రాయితీతో యంత్రాలు కొని, మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పుడు వారు దానిని విజయవంతంగా నడుపుతూ.. ఈ కేంద్రం ద్వారా కేవలం తమ అవసరాలు తీర్చుకోవడమే కాదు మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరు కూడా ఉపాధి, ఆదాయం పొందుతున్నారు.మాగుడు గడ్డి కోసం మొక్కజొన్న పంటను కోతకు రాకముందే పాల కంకి దశలోనే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలకు తీసుకుంటారు. ఈ మొక్కజొన్న పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తారు. అనంతరం దీనికి కొన్ని పోషకాలు కూడా కలుపుతారు.. దానిని మాగుడు గడ్డి బేల్స్‌గా మారుస్తారు. ఈ దీనిని పశువులు, పొటేళ్లకు దాణాగా వినియోగిస్తారు. ఈ మాగుడు గడ్డిని టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పలుకుతుంది. విడపనకల్లు మండలం కరకముక్కలకు చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డి ప్రాధాన్యతను గుర్తించారు. వారు ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు కొనుగోలు చేసి, ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా, రూ.45 లక్షలు రాయితీగా వచ్చింది. ప్రస్తుతం వారు నెలకు రూ.1.20 లక్షలు రుణ ఈఎంఐ చెల్లిస్తున్నారు. దీనితోపాటు, నెలకు రూ.1.5 లక్షలు నిర్వహణ ఖర్చుల కోసం వెచ్చిస్తున్నారు.ఈ మాగుడు గడ్డికి డిమాండ్ కూడా ఉంది.. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి,
శ్రీకాళహస్తి, నెల్లూరు వంటి ప్రాంతాల్లోని రైతులు ఆర్డర్లు పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీనిని పశువులు, జీవాల మేతకు ఉపయోగించుకుంటున్నారు. అంతేకాదు అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ఈ మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం గురించి తెలిసి రైతులను అభినందించారు. తాము గతంలో పశువుల, జీవాల మేత విషయంలో ఇబ్బంది పడ్డామని.. ఈ సమస్యకు పరిష్కారంగా ఇలా మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం దిశగా ఆలోచన చేశామన్నారు. తమ ప్రయత్నం ఫలించిందని.. ఈ మాగుడు గడ్డి ఒక బేల్ రెండు నెలలకుపైగా నిల్వ ఉంటుందని.. ఒకవేళ బేల్ విప్పితే వారం మాత్రమే వాడుకోవచ్చని తెలిపారు రైతులు. మొత్తం మీద ఇద్దరు రైతులకు వచ్చిన వినూత్న ఆలోచనతో వారు అవసరాలు తీరడంతో పాటుగా ఆదాయం కూడా వస్తోంది.. అలాగే మరికొందరికి ఈ కేంద్రం ద్వారా ఉపాధి కూడా కల్పిస్తున్నారు.

## ఎకరం రూ.177 కోట్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ.177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుంది. ఈ సంస్థ మొత్తం రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసుకుంది.టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ.1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ. 100-120 కోట్ల వరకు పలికేవి. ఈ సారి భారీగా పెరిగాయి. ఈ వేలంలో పాల్గొన్న మరో కొన్ని సంస్థలు కూడా పోటీ పడ్డాయి, కానీ ఎంఎస్ఎన్ రియాలిటీస్ అత్యధిక బిడ్‌తో విజయం సాధించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ భూమి, టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగం. వేలం ప్రక్రియలో మొత్తం 7.67 ఎకరాల భూమి వేలం వేశారు. ఎకరానికి రూ.177 కోట్లు ధర నిర్ణయమై, మొత్తం మొత్తంగా రూ.1,357 కోట్లు వసూలైంది. ఈ ధరలో భూమి అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు కూడా చేరుతాయి. ఐటీ కారిడార్ మధ్యలో నాలెడ్జ్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ పార్కుల మధ్య ఈ స్థలం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్లాన్. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ భూమి ధరలు రెండు రెట్లు పెరిగాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి విపులమైన ఆదాయం లభించడంతో, మరిన్ని ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఈ సంస్థ గతంలో



కూడా రాయదుర్గం ప్రాంతంలో పెద్ద భూములు కొనుగోలు చేసి, కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసింది. ఈ కొత్త భూమిపై ఐటీ పార్కులు, కార్పొరేట్ ఆఫీసులు నిర్మించే అవకాశం ఉంది. టీజీఐఐసీ ఎండీ శశాంక మాట్లాడుతూ.. తాజా ధర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని తెలిపారు. 2022లో కోకాపేట నియోపోలీస్‌లో జరిగిన వేలంలో ఎకరాకు రూ.100.75 కోట్లు గరిష్ఠ ధర పలికిన రికార్డును.. ఈ రాయదుర్గం నాలెడ్జ్ సిటీ వేలం అధిగమించింది. కొత్త రికార్డు ధర రూ.177 కోట్లు కావడంతో.. ఇది గత కోకాపేట ధర కంటే దాదాపు 75% అధిక వృద్ధిని సాధించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పారదర్శక, వ్యాపారానుకూల వాతావరణాన్ని నిర్మిస్తోందని.. పెట్టుబడిదారులు హైదరాబాద్ భవిష్యత్తుపై ఉంచిన నమ్మకానికి ఈ వేలం నిదర్శనమని శశాంక పేర్కొన్నారు. ఈ వేలాన్ని జేఎల్ఎల్ ఇండియా, ఎంఎస్టీసీ సంస్థల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.ఒకవైపు రాయదుర్గంలో వాణిజ్య భూములకు భారీ ధరలు పలకగా.. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూములు సైతం రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి.

# జగ్గారెడ్డి స్ట్రాంగ్ డెసిషన్ వెనుక..!



**మెదక్,తెలంగాణ దిశ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించి సంచలనానికి తెరతీశారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ దే అధికారం అని ప్రకటిస్తున్న సమయంలో జగ్గారెడ్డి తాత్కాలిక రాజకీయ బ్రేక్ ఎందుకన్నది ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ కు వచ్చే ఎన్నికల్లో అధికారం దక్కదని జగ్గారెడ్డి భావిస్తున్నారా? లేక తాను పోటీ చేస్తే సంగారెడ్డి నుంచి గెలిచే అవకాశం ఉండదని ఆయనకు ఏమైనా నివేదికలు అందాయా? అన్న విషయాలు బయటకు చెప్పకపోయినా తాను పదేళ్ల పాటు పోటీకి దూరంగా ఉంటానని జగ్గారెడ్డి చెప్పడం నియోజకవర్గంలోనే కాకుండా పార్టీలో కూడా హాట్ టాపిక్ గా మారింది. తూర్పు జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ఇప్పటికి మూడు సార్లు ఎమ్మెల్యేగా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి గెలిచారు. తొలిసారి 2004లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగ్గారెడ్డి ఆ ఎన్నికల్లో గెలిచారు. తర్వాత టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారారు. పార్టీ మారినప్పటికీ 2009 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జగ్గారెడ్డి విజయం సాధించారు. అయితే తర్వాత 2014 ఎన్నికల్లో మాత్రం రాష్ట్ర విభజన జరిగిన వెంటనే జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో మాత్రం జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆయనకు ఏ పదవి దక్కలేదు. . అందుకే ఈసారి జగ్గారెడ్డి మనసు మార్చుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తన సతీమణి నిర్మల బరిలో ఉంటారని చెప్పారు. పదేళ్ల పాటు తాను పోటీకి దూరంగా ఉంటానని ఆయన కార్యకర్తలకే తెలిపారు. ఒకవేళ తాను పోటీ చేసి మరోసారి ఓటమి పాలయితే ఏ పదవి లేకుండా ఉండాల్సి వస్తుందనా? లేక కొత్త వారికి అవకాశం ఇచ్చిన ట్లవుతుందనా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవచ్చున్న అంచనాకు ఆయన వచ్చారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అయితే పదేళ్ల గ్యాప్ తీసుకుని తిరిగి పోటీ చేస్తామనడం ఏరకమైన వ్యూహమన్నది క్యాడర్ కు కూడా అర్థం కాకుండా ఉంది. అయితే తన సతీమణి పోటీలో ఉంటుందని చెప్పడంతో కార్యకర్తలకు ఆయన టచ్ లోనే ఉంటూ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకు న్నట్లుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మొత్తం మీద జగ్గుభాయ్ నిర్ణయం వెనక మతలబు ఏమిటన్నది ఎవరికి అంతుపట్టని విధంగా ఉంది.

# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది.ఈ మార్గంలోఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు ప్రణాళికలలు సిద్ధం చేశారు. ఈ కారిడార్ ద్వారా నగరంలోలని అంతర్గత ట్రాఫిక్‌ను, ప్రధాన మార్గ ట్రాఫిక్‌ను వేరు చేయవచ్చు. దీని వల్ల నిరంతరాయంగా, వేగవంతైన ప్రయాణాన్ని సాధించవచ్చు. రవాణా సామర్థ్యాన్ని పెంచడం, తద్వార ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయడానికే ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఈ కారిడర్‌ను ప్రతిపాదించారు. సాధారణంగా ఒక పెద్ద నిర్మాణ ప్రాజెక్టును చేపట్టే ముందు, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం లేదా కన్సల్టెన్సీ సంస్థలు ప్రాజెక్టు డిజైన్, నిర్మాణ వ్యయం, సాంకేతిక అంశాలు, పర్యావరణ ప్రభావం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొనిరెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిర్మాణ వ్యయం, నిర్మాణ సమయం, ఇంజినీరింగ్, ఆర్థికపరమైన వివరాలతో వీటిని రెడీ చేశారు.ప్రభుత్వ అనుమతి కోసం పంపించనున్నారు. ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సవాళ్లతో కూడిన టాస్క్‌గా అధికారులు భావిస్తున్నారు. భూసేకరణ, ట్రాఫిక్ మళ్లింపు, మౌళిక వసతుల కల్పన అన్నింటిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినా సరే ఇది పూర్తి అయితే గంటల ప్రయాణం నిమిషాల్లోకి మారుతుంది. అంతే కాకుండా మేడ్చల్, సమీర్‌పేట్‌తో పాటు ఆ దారి చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇంధనం ఆదా అవుతుంది. కాలుష్యం తగ్గుతుంది. ఇది పూర్తి అయితే కచ్చితంగా హైదరాబాద్‌కు మరో మణిహారం తోడైనట్టుగా అధికారులు చెబుతున్నారు.

# బీహార్ లో కింగ్ మేకర్ గా పీకే...



పాట్నా, : ప్రశాంత్ కిషోర్. పేరుపొందిన రాజకీయ వ్యూహకర్త. మనదేశంలో రాజకీయాలను కూడా కార్పొరేట్ మయం చేసిన వ్యక్తి. పైగా ఎలాంటి రాజకీయాలు చేయాలో.. ఎలాంటి రాజకీయాలు చేస్తే ఓట్లు పడతాయో.. ఒక స్ట్రాటజీ మాదిరిగా అతను చెప్పేవాడు. మనదేశంలో ఉన్న మెజారిటీ రాజకీయ పార్టీలకు అతడు పని చేశాడు. అయితే ఎక్కువసార్లు అతడి ప్రణాళికలు విజయవంతమై.. అతడు పని చేసిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏపీలో వైసిపి, టిడిపి, కేంద్రంలో బిజెపి, ఒకానొక సందర్భంలో భారత రాష్ట్ర సమితి, టిఎంసి.. ఇలా అనేక రాజకీయ పార్టీలు అతడి ప్రణాళికలను అమలు చేసి అధికారంలోకి వచ్చాయి. ఎవరికో సేవలు చేసి.. అధికారంలోకి తీసుకొచ్చే బదులు.. తనే ఒక రాజకీయ పార్టీని పెట్టాలని ప్రశాంత్ కిషోర్ అనుకున్నాడు. అనుకున్నది తడవుగా జన్ సూరజ్ పేరుతో పార్టీ ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఆ పార్టీ బీహార్ రాష్ట్రంలో పోటీ చేస్తోంది.ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రశాంత్ కిషోర్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది.. అందువల్లే ప్రశాంత్ కిషోర్ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని తనదైన వ్యూహాలతో ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఈ పార్టీలతో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ తనదైన చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఏమాత్రం అవకాశం దొరికినా చాలు రెచ్చిపోతున్నారు. తను ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు గానీ.. బీహార్ రాష్ట్ర అభివృద్ధిని మాత్రం విస్మరించేది లేదని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు..రాజకీయ వ్యూహ కర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిషోర్ పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొన్న రాజకీయపరమైన విషయాలను మొహమాటం లేకుండా చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు కన్సల్టెన్సీ సేవల ద్వారా తాను 241 కోట్లు సంపాదించాలని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. వీటిలో 30.95 కోట్లు జీఎస్టీ రూపంలో.. 20 కోట్లు ఐటి రూపంలో చెల్లించినట్టు పేర్కొన్నారు. 98.75 కోట్లను పార్టీకి డొనేషన్ రూపంలో ఇచ్చినట్టు వెల్లడించారు. తన నైపుణ్యాన్ని అనుభవాన్ని ఉపయోగించి రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.. " రాజకీయాలు , వ్యాపారం వేరువేరు కాదు. ఒక వ్యాపారి ముందస్తు లాభాలను గురించి పెట్టుబడి పెడుతుంటాడు. జనాల అవసరాలకు తగ్గట్టుగా నడుచుకుంటాడు. రాజకీయ పార్టీలు కూడా అంతే. జనాల అవసరాల ఆధారంగా హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో షరతులు విధిస్తుంటాయి. ఎన్నికల్లో చేసిన ఖర్చుకు మించి సంపాదిస్తుంటాయి. అయితే ఇందులో వ్యూహాత్మకతను పాటించే రాజకీయ పార్టీకి మాత్రమే అధికారం దక్కుతుందని" ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

# పీకల్లోతు కష్టాల్లో అగ్రరాజ్యం

## వేలాది మందికి జీతాల్లేవు

న్యూయార్క్ : అమెరికా అంటే అవకాశాల స్వర్గం.. డాలర్ రాజ్యం.. సంపన్న దేశం.. ఇలాంటి ఉప మానాలనే మీడియా ఉపయోగిస్తుంది. అమెరికా గురించి సినిమాలలో కూడా గొప్పగా చెబుతుంటారు. ఇక ప్రపంచ దేశాలు కూడా అమెరికా అంటే భయపడుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా మారకం అనేది డాలర్ తో కొనసాగిస్తారు కాబట్టి.. సహజంగానే డాలర్ కు విపరీతమైన గిరాకీ ఉంటుంది. అయితే అంతటి అమెరికా ఇప్పుడు ముప్పు ముంగిట ఉందా? త్వరలో ఆర్థికంగా పతనం కాబోతోందా? ఇప్పుడు ఈ ప్రశ్నలే మీడియాలో వినిపిస్తున్నాయి.ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తూ అమెరికా బెంబేలెత్తిస్తోంది. అంతేకాదు మరిన్ని టారిఫ్ లు విధిస్తామని ప్రపంచ దేశాలను హెచ్చరిస్తోంది. భారత్ నుంచి మొదలు పెడితే చైనా వరకు అన్ని దేశాలు కూడా అమెరికా టారిఫ్ ల వల్ల ఇబ్బంది పడుతున్నవే. అమెరికా వల్ల ప్రపంచ దేశాలు నరకం చూస్తున్నాయి. టారిఫ్ ల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ అమెరికా ఏమాత్రం తగ్గడం లేదు. వెనకడుగు వేసే అవకాశం కనిపించడం లేదు. పైగా ట్రంప్ వల్ల భారత ఐటీ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇటీవల కాలంలోనే హెచ్ వన్ బి వీసాల విషయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ ఐటి పరిశ్రమలను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. అయితే దీనిపై ట్రంప్ ఇంతవరకు వెనకడుగు వేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వార్తలు వినిపిస్తున్నాయి.ప్రపంచ దేశాలకు చుక్కలు చూపిస్తున్న అమెరికాలో అంతర్గతంగా మాత్రం పరిణామాలు ఏ మాత్రం బాగోలేదు.. అమెరికాలో బడ్జెట్ కు ఆమోదం లభించలేదు. దీంతో పూర్తిగా షట్ డౌన్ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. డెమొక్రటిక్, రిపబ్లికన్ లు వేరువేరుగా ప్రతిపాదనలు చేయడంతో అక్కడ పరిస్థితి దారుణంగా మారింది. వ్యయ ప్రామాణిక బిల్లు ఆమోదం పొందకపోవడంతో ఫెడరల్ ప్రభుత్వానికి నిధుల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అనేక విభాగాలు, కార్యాలయాలు తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశాయి. ఏకంగా ఎఫ్ఏ విభాగంలో 11 వేల మంది ఉద్యోగుల వేతనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అక్కడ అత్యవసర విమాన నియంత్రణ కార్యకలాపాలు మాత్రమే సాగుతున్నాయని తెలుస్తోంది. దాదాపు 41 శాతం మంది ఉద్యోగులకు వేతనాలు పూర్తిగా నిలిచిపోయాయి.అమెరికాలో ఏర్పడిన ఈ పరిస్థితి వల్ల హెల్త్, హ్యూమన్ సర్వీసెస్ ఏజెన్సీలు పనికి దూరమయ్యాయి. ప్రజారోగ్యం, విమాన రవాణా.. ఇతర అత్యవసర సేవలు మాత్రమే అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. రక్షణ, పోలీసు, ఎమర్జెన్సీ హెల్త్ సర్వీస్ వంటి విభాగాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. గడచిన ఏడు సంవత్సరాల కాలంలో అమెరికా ఇలా స్తంభించిపోవడం ఇది మొదటిసారి కావడం విశేషం. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్లే ఇదంతా జరుగుతోందని అమెరికా మీడియాలో వార్తలు వస్తున్నాయి. బడ్జెట్ ఆమోదం విషయంలో ఏర్పడిన ఈ సందిగ్ధత అమెరికా పరువును మొత్తం పోగొట్టిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటువంటి పరిణామాలు అగ్రరాజ్యానికి ఏమాత్రం మంచివి కావని వాపోతున్నారు.

# ట్రంప్ చర్యలతో అప్రమత్తంగా ఉండాల్సిందే

## ప్రత్యమ్నాయ రంగాలపై దృష్టి సారించాలి

న్యూఢిల్లీ, : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని అనేక అనూహ్య ఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా భారత్ అనేక పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ట్రంప్ ఏ రోజు ఎలాంటి ఆంక్షలు తెస్తారో తెలియకుండా ఉంది. మేకిన్ ఇండియా అంటున్న భారత్ ప్రధాని అందుకు తగ్గట్లుగా కార్యాచరణకు దిగాలి. స్వయం సమృద్ధి సాధించేలా ప్రయత్నాలు ప్రారంభించాలి. ముఖ్యంగా యువత ఊనైపుణ్యలకు పదును పెట్టాలి. ఇకపోతే దాదాపు ఐదేళ్ల తర్వాత అక్టోబర్ 26 నుండి భారత్– చైనాల మధ్య విమాన రాకపోకల పున:ప్రారంభానికి కేంద్రం గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఈ విషయాన్ని తాజాగా ఓ సీనియర్ ప్రభుత్వాధి కారి వెల్లడించారు. శీతాకాలం ప్రారంభమయ్యే కాలంలో భారత్– చైనాల మధ్య నేరుగా విమాన రాకపోకల్ని అక్టోబర్ 26 నుండి పున:ప్రారంభించడానికి అంగీకరించినట్లు భారత విదేశాంగ మంత్రి త్వశాఖ ప్రకటించింది. మరోవైపు అక్టోబర్ 26 నుండి కోల్‌కతా– గ్వాంగ్‌జౌ రోజువారీ సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది. ఇరు దేశాల మధ్య నియంత్రణ ఆమోదాలు అమల్లోకి వచ్చిన తర్వాత న్యూఢిల్లీ నుండి చైనాకు రోజువారీ విమాన సేవలను అందుబాటులోకి తేనున్నట్లు ఇండిగో తెలిపింది. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, సిచువాన్ ఎయిర్‌లైన్స్‌లు కార్గో విమానాలకు అనుమతి కోరాయి. భారతీయ విమానయాన సంస్థలు ఇరు దేశాల మధ్య సేవల్ని కొనసాగించడానికి ఒప్పందానికి కట్టుబడి ఉన్నాయి. ప్రస్తుత ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం ఆరు గమ్యస్థానాలకు చేరుకోవడానికి వీలుకల్పిస్తుంది. అయితే వారంలో 42 విమానాల కంటే ఎక్కువ నడపకూడదని ఒప్పందంలో ఉంది. చైనా విమానాలు ప్రతివారం 42 విమానాలను నడుపుతున్నాయి. వాటిలో ఎయిర్ చైనా (బీజింగ్– ముంబై) వారానికి నాలుగుసార్లు, బీజింగ్ –ఢిల్లీకి ఐదుసార్లు సార్లు ప్రయాణీకుల రాకపోకల్ని కొనసాగిస్తున్నాయి. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ–గ్వాంగ్‌జౌకు రోజుకు రెండుసార్లు సర్వీసుల్ని కొనసాగిస్తుంది. చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ వారానికి ఎనిమిది, వాటిలో రోజువారీ ఢిల్లీ– షాంఘై విమానాలను నడుపుతుంది. షాన్డాంగ్ ఎయిర్‌లైన్స్ కున్మింగ్ నుండి ఢిల్లీకి వారానికి నాలుగుసార్లు విమానాల ను నడుపుతుంది. రువాండాకు చెందిన రువాండ్ ఎయిర్‌లైన్స్ కూడా వారానికి మూడుసార్లు గ్వాంగ్జౌ– ముంబైల మధ్య విమాన సర్వీసుల్ని కొనసాగిస్తుంది. భారతీయ విమానయాన సంస్థల్లో ఒకటైన ఎయిర్



ఇండియా న్యూఢిల్లీ నుండి వారానికి ఐదుసార్లు షాంఘైకి విమానాలను నడుపుతుంది. ఇండిగో కూడా చెంగ్డు– ఢిల్లీ, గ్వాంగ్జౌ– కోల్‌కతాల మధ్య రోజువారీ విమానలను నడిపింది. ఈ నేపథ్యంలో ప్రయాణీకుల, కార్గో విమానాల కోసం ఐదు చైనా ఎయిర్‌లైన్స్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)ని సంప్రదించాయి. విమానాల రాకపోకలు పున:ప్రారంభించడానికి ఇక ఆలస్యం చేయకూడదని భారత్– చైనా నేతలు కోరుకుంటున్నారని ప్రభుత్వాధికారి పేర్కొన్నారు. ఇక ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి, ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఈ సంవత్సరం ప్రారంభం నుండి రెండు దేశాలు సాంకేతికస్థాయి చర్చలు జరుపుతున్నాయని, ఇందులో విమాన సేవా ఒప్పందం కూడా ఉందని భారత విదేశాంగశాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇండిగోతోపాటు, ఎయిర్ ఇండియా కూడా ఈ ఏడాది చివరి నుంచి షాంఘైకి విమాన సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇక ఆకాశ విమానయాన సంస్థ కూడా అదే ఆలోచనలో ఉంది. చైనా నుంచి భారత్‌కు చేరే ప్రయాణీకుల కోసం చైనా కూడా షాంఘై –ఢిల్లీ (వారానికి ఐదు విమానాలు) విమాన సర్వీసులను ప్రారంభించింది. వీటికి డిజిసిఎ అనుమతినిచ్చింది. ప్రయాణీకుల విభాగంలో ఎయిర్ చైనా, షాన్డాంగ్‌లు దరఖాస్తు చేసుకున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికల్లో టీ'ఢీ' పీ


**ఖమ్మం,తెలంగాణ దిశ :**తెలంగాణలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని పార్టీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. అభ్యర్థులను బరిలో దించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రధానంగా అక్కడ అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే ఆ మూడు పార్టీలకు ఇప్పుడు గెలుపు ముఖ్యం. అలా గెలవాలంటే గ్రౌండ్ లెవెల్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతు అవసరం. అసలు తెలుగుదేశం పార్టీ నాయకత్వం అభిప్రాయం ఏంటి? అనేది మాత్రం తెలియడం లేదు. మొన్న ఆ మధ్యన హడావిడి చేసిన టిడిపి నాయక త్వం ఇప్పుడు వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తోంది. దీంతో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందా? లేకుంటే తప్పుకుం టుందా? లేకుంటే ఏ పార్టీకైనా మద్దతు తెలుపుతుందా? అన్నది మాత్రం తెలియడం లేదు. వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తే తప్పకుం డా అది కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చినట్టే.తెలంగాణలో తెలుగుదే శం పార్టీని దారుణంగా దెబ్బతీశారు కెసిఆర్. అందుకే అక్కడ టిడిపి శ్రేణులు గులాబీ పార్టీ వైపు వెళ్లే ఛాన్స్ లేదు. అయితే ఏపీలో బిజెపితో కలిసి ఉంది తెలుగుదేశం. ఎన్డీఏ లో కీలక భాగస్వామి. అయితే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కలుపు కెళ్లే ప్రయత్నం చేయలేదు బిజెపి. 2023 ఎన్నికల్లో సైతం జనసేనతో కలిసి వెళ్ళింది తప్ప టిడిపి తో కలిసి వెళ్లేందుకు ఇష్టపడలేదు. అందుకే బిజెపి పట్ల టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన అసహనం ఉంది. కాంగ్రెస్ పార్టీకి నేరుగా మద్దతు తెలిపే ఛాన్స్ లేదు. అందుకే ఇప్పుడు టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూ స్తున్నాయి.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి నాయకులు లేరు. కానీ క్యాడర్ మాత్రం ఉంది. ఖమ్మం( లాంటి జిల్లాల్లో ఇప్పటికీ టిడిపి శ్రేణులు యాక్టివ్ గానే ఉన్నారు. 2023 ఎన్నికల నాటికి చంద్రబాబు జైల్లో ఉన్నారు. అందుకే అక్కడ తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. అయితే అప్పట్లో టిడిపి వ్యూహాత్మక మౌనం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి వరంగా మారింది. కాంగ్రెస్ విషయంలో టిడిపి శ్రేణులకు భిన్న వైఖరి ఉన్న.. రేవంత్ రూపంలో చంద్రబాబును చూసుకుంటారు అక్కడి టిడిపి క్యాడర్. అందుకే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలుగుదేశం పార్టీ పరోక్ష సహకారం అందించినట్టే. పోటీ చేయకపోవడంతో టీడీపీ శ్రేణులు కాంగ్రెస్ వైపు టర్న్ అయ్యాయి. అయితే మొన్న ఆ మధ్యన తెలంగాణలో టిడిపి భవన్ కు వచ్చారు నారా లోకేష్. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం అంటూ పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా టిడిపి నాయకత్వం నుంచి కదలిక లేదు. అందుకే టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి టిడిపి హై కమాండ్ ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో చూడాలి.

# చలాన్లు పెండింగ్ ఉంటే వెహికిల్ సీజ్



న్యూఢిల్లీ, : రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. ఎన్ని కఠిన నిబంధనలు విధించినా ప్రమాదాలు తగ్గడం లేదు. వివిధ కారణాలతో వాహనదారులు రూల్స్ అతిక్రమి స్తున్నారు. జరిమానా విధించినా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా వసూలుతోపాటు వాహనదారుల్లో మార్పు కోసం మరికొన్ని కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. మోటారు వెహికిల్స్ రూల్స్?1989లో కేంద్రం ప్రతిపాదించిన సవరణలు రవాణా నియంత్రణలో కొత్త పద్ధతులను తీసుకురావడం లక్ష్యంగా ఉన్నాయి. ఇప్పటి వరకు చలాన్ చెల్లించడానికి ఇచ్చిన 90 రోజుల గడువును 45 రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులో చెల్లించని వాహనాలు సీజ్ చేసే అధికారం అధికారులకు లభించనుంది.కొత్త నిబంధనల ప్రకారం ఐదుకుపైగా ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదైతే డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. తరచూ నిబంధనలు అతిక్రమించే డ్రైవర్లను నియంత్రించడానికి ఇది సమర్థమైన చర్యగా భావిస్తున్నారు.చలాన్ చెల్లింపులో ఆలస్యం జరిగితే, ఆ వాహనంపై ఏ రకమైన రిజిస్ట్రేషన్, బీమా లేదా విక్రయ లావాదేవీలు చేయడం సాధ్యంకాదని తాజా ముసాయిదా నిబంధనలు చెబుతున్నాయి.

# అర్థం కానీ కవిత వ్యూహం...



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అవే ప్రశ్నలు.. వేదిక మాత్రమే మారుతుంది.. కవిత సంధించే తీరు మాత్రం మారడం లేదు.. ప్రతి విషయంలో కూడా ఆమె గులాబీ పార్టీ తప్పులను వేలెత్తి చూపిస్తోంది.. ప్రాజెక్టుల నుంచి మొదలుపెడితే రోడ్ల వరకు ప్రతి విషయంలోనూ ఆమె స్పష్టంగా మాట్లాడగలుగుతుంది. జూబ్లీహిల్స్ ఓటమి తర్వాత కవిత మరింత ఘాటుగా స్పందిస్తోంది. గులాబీ పార్టీ మీద విమర్శలు చేస్తోంది. వాస్తవానికి ఈ విమర్శలకు సమాధానం చెప్పాల్సిన స్థితి నుంచి గులాబీ పార్టీ నేతలు కవితను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు.. ఓ గులాబీ పార్టీ నాయకుడు అయితే ఏకంగా కవితను రాక్షసి అని సంబోధించాడు.. వాస్తవానికి కేసీఆర్ బతికి ఉండగానే కెసిఆర్ కుమార్తెను సొంత పార్టీ వాళ్లు తిడుతుండడం.. ఇంతకంటే దారుణం మరొక నాయకుడికి ఉండదు.కవిత పదేపదే హరీష్ రావును లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తోంది.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోవడం కంటే పెద్ద అభిమానం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఉండదని కవిత ఆరోపించింది.. హరీష్ రావును మోసగాడు అని చెబుతున్న కవిత.. అతడు రేవంత్ రెడ్డికి టచ్ లో ఉన్నాడని ఆరోపిస్తోంది.. పార్టీలో ఉంటూ పార్టీని నిండా ముంచేస్తున్నాడని విమర్శిస్తోంది.. అంతేకాదు కేటీఆర్, హరీష్ రావు తమ భుజాల మీద గులాబీ పార్టీని మోస్తున్నట్టు.. కెసిఆర్ ను కాపాడుకుంటున్నట్టు బిల్డప్ ఇస్తున్నారని.. కానీ కెసిఆర్ ముందు తూగలేరనే విషయాన్ని వారిద్దరు మర్చిపోతున్నారని కవిత ఆరోపించారు.. కృష్ణార్జునల మని ఇద్దరు చెప్పుకుంటున్నారు.. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని.. ఒకరి మీద మరొకరు బాణాలు వేసుకుంటున్నారని.. ఫలితంగా క్యాడర్ మొత్తాన్ని నాశనం చేస్తున్నారని కవిత ఆరోపిస్తున్నారుగులాబీ పార్టీ బలం మొత్తం సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తోందని.. క్షేత్రస్థాయిలో అంత సన్నివేశం లేదని కవిత మండిపడుతున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల హరీష్ రావు, గంగుల కమలాకర్, నవీన్ రావ్ కు భూములు ఉన్నాయని.. వాటిని కాపాడుకోవడం కోసం రోడ్డు అలైన్మెంట్ మార్చే శారని కవిత ఆరోపించారు. అంతేకాదు రీజినల్ రింగ్ రోడ్ వల్ల రెడ్డిపల్లి గ్రామంలో సుమారు 56 మంది రైతులు తమ 59 ఎకరాల భూములను కోల్పోయారని.. ఈ విషయాలు కేసీఆర్ కు తెలియకుండా హరీష్, ఇతర నేతలు చూశారని.. అందువల్ల మెదక్ జిల్లాలో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయిందని కవిత సంచలన ఆరోపణలు చేశారు.కవిత ఇంటిపేరు కల్వకుంట్ల కాబట్టి.. కెసిఆర్ కుమార్తె కాబట్టి ఆమె చేస్తున్న ఆరోపణలన్నీ కూడా తెలంగాణ వ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. వాస్తవానికి ఆమె మాట్లాడుతున్న మాటలు సంచలనంగా ఉన్నాయి. ఇప్పటికే చాలామంది బాధితులు కవితని కాలుస్తున్నారు.. కవిత చేస్తున్న ఆరోపణలపై గులాబీ పార్టీ నాయకులు కేవలం వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని కౌంటర్ ఇస్తున్నారు. అంతేతప్ప కవిత చేసిన విమర్శలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. కవిత గులాబీ పార్టీ చేసిన తప్పులను మొత్తం బయటపెడుతున్న నేపథ్యంలో కేడర్ మొత్తం అయోమయంలో ఉంది. తీవ్ర నిరాశ నిస్పృహల మధ్య వారంతా కూడా తనవైపు వస్తున్నారని కవిత చెబుతున్నారు.. కవిత చేస్తున్న ఆరోపణలు గులాబీ పార్టీలో ఉన్న అసలు బాగోతాన్ని బయటపెడుతున్నాయి.

# ఆ నాలుగు ప్రాంతాలకు మహర్ధశ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో రోడ్లకు మహర్ధశ పట్టనుంది. తెలంగాణలో ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టాల్సిన 4 జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల-కరీంనగర్, జగిత్యాల- మంచిర్యాల జాతీయ రహదారులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది. అంతకుముందు మహబూబ్‌నగర్-గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే ఆహ్వానించింది. ఈ నాలుగు రహదారులను ఎన్‌హెచ్‌ఏఐ మొత్తం 271 కి.మీ. మేర రూ. 10,034 కోట్లతో నిర్మించనుందని సమాచారం.ఈ డిసెంబరులో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు చేపట్టనుంది. ఇందులో జగిత్యాల- మంచిర్యాల హైవేని ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగతా మూడింటిని హ్యామ్ విధానంలో వేయనున్నారు. ఈ నాలుగు రహదారులకు పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తే వెంటనే పనులు మొదలవుతాయి. జాతీయ రహదారుల వివరాలు..: మహబూబ్‌నగర్- గూడెబల్లూర్ జాతీయ రహదారి: 80 కి.మీ. మేర రూ. 2,662 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఆర్మూర్- జగిత్యాల జాతీయ రహదారి: 64 కి.మీ. మేర రూ. 2,338 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు 288.3 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. జగిత్యాల- కరీంనగర్: 59 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,484 కోట్లతో నిర్మిస్తారు. ఇందుకు 306.7 హెక్టార్ల భూసేకరణ చేయాలి. జగిత్యాల-



మంచిర్యాల రహదారి: 68 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,550 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఇందుకుగానూ 317 హెక్టార్ల భూమి సేకరించాలి. 6 లేన్లలో ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులు: ప్రాంతీయ వలయ రహదారి ఉత్తరభాగం పనుల సవరణ టెండర్లకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే దానిపై చర్యలు వేగవంతం చేయనుంది. గతంలో ఈపీసీ పద్ధతిలో ఈ పనుల కోసం టెండర్లు పిలవగా, ఈసారి హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టేలా టెండర్లు పిలుస్తారు. 2024 డిసెంబరులో సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161 కి.మీ. మేర 4 లేన్ల రహదారిని రూ. 7,104 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించింది. అయితే ట్రాఫిక్ సర్వే, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని దీనిని ఆరు వరుసలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఊపింది. మొత్తం రూ. 15,627 కోట్లతో ఆరు లేన్లుగా ఆర్ఆర్ ఉత్తర భాగం అభివృద్ధి చేయనున్నారు.

# బీసీలను ఎన్నాళ్లు...

## చట్టబద్ధత సాధ్యమేనా

బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్తామని గతంలో చాలెంజ్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అవి సాధ్యం కాకపోవడంతో ఎలా ముందుకెళ్లాలా అన్నదానిపై కిందా మీదా పడుతోంది. సాధ్యం కావడం లేదు అని ప్రజలు చెప్పడానికి మొహమాట పడుతోంది. అలాగే మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణలో బ్యాక్‌వర్డ్ క్లాసెస్లకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన కాంగ్రెస్ హామీ, ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని "కామారెడ్డి డిక్లరేషన్"గా ప్రకటించి, ఃఅల ఓటు బ్యాంకును సృష్టించుకుంది. కానీ, తాజా హైకోర్టు స్టే, సుప్రీంకోర్టు తిరస్కారాలు, ఆర్థిక-చట్టపరమైన సమస్యల మధ్య, "ఇది సాధ్యమే కాదని " క్లారిటీ వస్తోంది. తెలంగాణలో ఃఅలు 56 శాతం జనాభా ఉన్నారు. కులగణనలో ఇది తేల్చారు. కానీ 29 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇవి ఉద్యోగ, విద్య అవకాశాల్లో. రాజకీయంగా అయితే స్థానిక ఎన్నికల్లో 25 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉంది. కాంగ్రెస్ 'కామారెడ్డి ఃఅ డిక్లరేషన్'లో ఃఅలకు 42% రిజర్వేషన్లు, కులగణన చేస్తామని ప్రకటించారు. కులగణన చేశారు. హౌస్-టు-హౌస్ డేటా కలెక్షన్ చేశారు. అలు 56.33% అని రిపోర్ట్ వచ్చింది. ఈ డేటా ఆధారంగా అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేశారు. విద్య, ఉద్యోగ లోకల్ బాడీల్లో 42% ఃఅ కోటా కల్పించారు. కానీ సుప్రీంకోర్టు పెట్టిన 50% కోటాను దాటిపోతుంది. బిల్లులు ఆమోదించాలని ఆగస్టులో రేవంత్ ఢిల్లీలో ధర్నా కూడా చేశారు. చివరికి జీవో ఇచ్చారు. ?

జీవోపై హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రభుత్వం సుప్రీంకోర్టులో ాఒఖ ఫైల్ చేసింది. ఆ ఎస్ఎల్పీని సుప్రీంకోర్టు కొట్టి ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ ను ప్రధానిని చేసుకుని బిల్లును ఆమోదించుకుంటామని ప్రకటించారు. అంటే ఆయనకు ఇప్పుడల్లా లీగల్ గా రిజర్వేషన్లు రావని క్లారిటీ ఉన్నట్లే. అయితే బిల్లులు ఆమోదించడం లేదని కేంద్రాన్ని నిందిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "42% కోటా సైంటిఫిక్, ఃఅల హక్కు. బిజేపీ కేంద్రం బిల్లులు పెండింగ్‌లో పెట్టి ఃఅలను మోసం చేస్తోంది" అని ఆరోపిస్తున్నారు. కానీ న్యాయపరంగా ఊరట లభించలేదు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో ాఒఖ ఫైల్ చేసింది, కానీ ాఅ "హైకోర్టు స్టే సరైనది" అని తిరస్కరించింది. సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్నీ జడ్జ్‌మెంట్ ప్రకారం 50% రిజర్వేషన్ క్యాప్ పెట్టింది. కానీ తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టారు. కానీ తెలంగాణకు అది సాధ్యం కాదు. రాజ్యాంగసవరణ అవసరం. అది ఇప్పుడల్లా సాధ్యం కాదు. అందుకే సీఎం రేవంత్ బీసీ రిజర్వేషన్ల అంశంపై.. ప్రజలకు నిజాలు చెప్పి.. పార్ట ?పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం కనిపిస్తోంది. లేకపోతే ప్రజలు ముఖ్యంగా బీసీలు తమను మోసం చేశారని అనుకునే ప్రమాదం ఉంది.

# మళ్లీ తెరపైకి విశాఖ స్టీల్ ప్లాంట్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. పనిచేస్తున్న ఉద్యోగుల విషయంలో టార్గెట్లు ఇచ్చింది యాజమాన్యం. చెప్పిన పనికి, ఆదేశించిన లక్ష్యానికి మేరకు జీతాల చెల్లింపు ఉంటుందని తేల్చి చెప్పింది. ఒక విధంగా చెప్పాలం టే ప్రైవేట్ సంస్థల ఫార్ములాను తెరపైకి తెచ్చింది. దీనిపై స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఇది ప్రైవేటీకరణకు ఉద్దేశించిన నిర్ణయమని తప్పుపడుతున్నాయి. అయితే అందులో తప్పేముందని.. ఉత్పత్తి పెరగాలంటే ప్రతి ఉద్యోగి పని చేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పినట్లు అయింది. ఇటీవల ఏపీ సీఎం చం ద్రబాబు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచా రం నడిచింది. ఇప్పుడు ఉత్పత్తి పెంపునకు సంబంధించి లక్ష్యాలు విధించడం సైతం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇది కంపెనీ వృద్ధి కోసమేనని.. స్టీల్ ప్లాంట్ ఉన్న పరిస్థితిని అధిగమించేందుకేనని విశ్లేషణలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అనేక ప్రయోగాలు చేసింది యాజమాన్యం. అయితే ఉత్పత్తి పెరగకపోవడానికి మానవ తప్పిదాలు ఉన్నాయని భావించి ఈ లక్ష్యాలను విధించినట్లు తెలుస్తోంది.ప్రపం చంలోనే విశాఖ స్టీల్ ప్లాంట్ చాలా గుర్తింపు ఉంది.. ఇక్కడ స్టీల్ నాణ్యమైనదిగా గుర్తించి ఎక్కువగా అమ్మకాలు జరుగుతుంటాయి. అమ్మకాలకు తగ్గట్టు ఇక్కడ ఉత్పత్తి జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిన ఉత్పత్తి పెరగడం లేదు. ఎన్నో రకాల ఉత్పత్తి ప్రయోగాలు చేస్తున్న ఫలితం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో యాజమాన్యం ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఉత్పత్తి పెంపుదలకు సంబంధించి లక్ష్యాలను విధించింది. అయితే దీనిని వ్యతిరేకిస్తున్నాయి ఉద్యోగ సంఘాలు. కానీ కేంద్ర ప్రభుత్వ ఆలోచన వేరేలా ఉంది.కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతోంది. దేశంలో ప్రైవేటు స్టీల్ ప్లాంట్లకు గనుల కేటాయింపు జరుగుతోంది. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ కు గనుల కేటాయింపు జరగకపోవడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వ వాదన వేరేలా ఉంది. సమయానుకూలంగా స్టీల్ ఉత్పత్తులు ఇవ్వలేకపోతున్నామని.. ఇప్పుడు పని చేస్తున్న వారిలో కాంట్రాక్టు సిబ్బంది మాత్రమే మెరుగైన సేవలందిస్తున్నారని.. శాశ్వత ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని..వారు పనిచేస్తే ఉత్పత్తి ఎక్కడికో వెళ్లేదని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. అందుకే పనిచేసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టుకోవా లని ఉద్యోగులకు సూచిస్తుంది. అయితే సొంత గనులు లేకుండా అభివృద్ధి ఎలా అని కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నిస్తుండగా.. ఉన్న వనరులతోనే ఉత్పత్తి అందించలేకపోతున్నారని.. కనులు కేటాయిస్తే ఏం చేస్తారులే అన్నట్టు మాట్లాడుతోంది కేంద్ర ప్రభుత్వం. మొత్తానికి అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం ఎప్పుడు వార్తల్లో నిలిచేదే..!

## రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- కొంపల్లి, గుడాడ్ పల్లి, నేరేడుపల్లి, గొర్లవీడు గ్రామాలల్లో వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే..**



**జయశంకర్,తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి మండలం కొంపల్లి, గుడాడ్ పల్లి, నేరేడుపల్లి, గొర్లవీడు గ్రామాలల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించా రు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం గొర్లవీడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.


# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు !

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కిం చడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించింది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించా రంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం చూస్తూనే ఉన్నాం. ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదాజియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటి ఇస్లామిక్ ఛాందసశక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే. ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించు కున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటివరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోతకోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం. ఓ రకంగా పాకిస్థాన్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిది. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌ను, బంగ్లాదేశ్‌ను ఎగదోయడం వెనక ఎవరున్నారన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగిం చాలని యూనిస్ ప్రభుత్వం కోరుతూ వచ్చింది. ఇప్పుడు ఉరిశిక్ష విధించారు. కనుక భారత్ మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది. ఇదంతా పెద్దన్న ఆడిస్తున్న నాటకమని తెలుసుకోవడానికి పెద్దగా తెలివి తేటలు అక్కర్లేదు.

# సినిమా..

## బ్లాక్ డ్రెస్సులో జాన్వీ కపూర్ గ్లామర్ షో






ముంబై: జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.

## రూ.308 కోట్ల క్లబ్‌లో 'ఓజీ'..




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో సునామీ సృష్టిస్తోంది. ఒకవైపు నుంచి బాక్సాఫీస్ వద్ద కాంతార నుంచి గట్టి పోటి ఎదురవుతున్న కూడా కలెక్షన్ల మాత్రం తగ్గట్లేదు. తాజా సమాచారం ప్రకారం 11 రోజుల్లో ఈ చిత్రం రూ.308 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ వసూళ్లతో, 2025లో అత్యధిక గ్రాస్ సాధించిన తెలుగు చిత్రంగా 'ఓజీ' సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఇంతకుముందు ఈ రికార్డు వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం'(రూ.303 కోట్లు)సినిమా పేరిట ఉంది. అలాగే ఈ సినిమా పవన్ కళ్యాణ్ సినీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో పవన్ కళ్యాణ్ 'ఓజస్ గంభీరా' అనే పాత్రలో స్టైలిష్‌గా కనిపించారు. ఈ విజయంతో దర్శకుడు సుజీత్ ఈ సినిమాకు ప్రీక్వెల్ మరియు సీక్వెల్‌లను కూడా నిర్మించనున్నట్టు ప్రకటించారు.

## త్రిష కెరియర్ ను 'విశ్వంభర' పరిగెత్తిస్తుందా?



త్రిష .. దాదాపు పాతికేళ్ల కెరియర్ ను చూసిన నాయిక. తెలుగు .. తమిళ భాషల్లో స్టార్ డమ్ ను చూసిన బ్యూటీ. అలాంటి త్రిషకి ఆ మధ్య కాలంలో అవకాశాలు తగ్గుతూ వెళ్లాయి. ఆ సమయంలో ఆమె నాయికా ప్రధానమైన కథలను చేస్తూ వెళ్లింది. ఆ క్రమంలో 'రాంగీ' 'ది రోడ్' '96' వంటి సినిమాలు ఆమె కెరియర్ ను మరికాస్త ముందుకు నడిపించాయి. ఈ నేపథ్యంలోనే త్రిషను సినిమా ఫంక్షన్ కి సంబంధించిన ఒక వేదికపై చూసి అందరూ షాక్ అయ్యారు. అందుకు కారణం గతంలో కంటే ఆమె ఇప్పుడు మరింత గ్లామరస్ గా ఉండటమే. త్రిష గురించి .. ఆమె గ్లామర్ గురించి సోషల్ మీడియాలో సందడి సాగింది. దాంతో ఆమెకి మళ్లీ పెద్ద బ్యానర్ల నుంచి .. సీనియర్ స్టార్స్ సినిమాల నుంచి కాల్స్ వెళ్లడం మొదలైంది. అలా ఆమె రజనీకాంత్ కమల్ వంటి సీనియర్ స్టార్స్ సరసన..విజయ్ – అజిత్ వంటి స్టార్స్ జోడీగా మెరిసింది. గ్లామర్ పరంగా త్రిష ఆ సినిమాలకి చాలా హెల్ప్ అయింది. కానీ ఆ సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం ఆమె అభిమానులను నిరాశ పరిచింది. ఈ క్రమంలోనే తమిళంలో ఆమె సూర్య సినిమా 'కరుప్పు'లో నటిస్తోంది. ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న .
ఈ సినిమాకి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'విశ్వంభర'లో కనిపించనుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ వయసులోను గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసిన త్రిషకు ఇప్పుడు ఒక పెద్ద హిట్ అవసరం. ఆమె కోరుకుంటున్న విజయాన్ని 'విశ్వంభర' అందిస్తుందా? ఆమె కెరియర్ ను పరిగెత్తిస్తుందా? అనేది చూడాలి.

## అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్ ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.
నాని 'మజ్నూ'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.

## ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!





వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## వయసు ఓ సంఖ్య మాత్రమే.. స్టైలిష్ ఫోటోషూట్‌తో చిరంజీవి

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఎనర్జీతో, స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను అబ్బురపరిచారు. ఇటీవల రవి స్టూడియోస్ వారి ఆధ్వర్యంలో ఆయన ఇంట్లో నిర్వహించిన ఫోటోషూట్ లో చిరంజీవి మార్చిన ఐదు నుంచి ఆరు కాస్ట్యూమ్స్‌కి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 70 ఏళ్ల వయసులోనూ చిరు ఇంత యంగ్ లుక్ లో కనిపించడం చూసి నెటిజన్లు ఆశ్చర్యంతో.. 70 ఏళ్ల వయసులోను 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొట్టేస్తున్నారు అని కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పర్యావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటివి మన ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్న ఈ రోజుల్లో చిరంజీవిలాంటి హీరోలు చూపిస్తున్న ఫిట్‌నెస్ నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది దేవుని వరమో లేకుంటే, ఫిట్‌నెస్ పట్ల పట్టుదల ఫలితమో కాని, ఆయనలోని స్టైల్, గ్రేస్ మాత్రం అసలే తగ్గడం లేదు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలోని "మీసాల పిల్ల" పాట ప్రోమోలో చిరంజీవి స్టైలింగ్ పై కొంత మంది విమర్శలు చేశారు. అయితే తాజా ఫోటోషూట్ ద్వారా చిరు అటువంటి కామెంట్లకు స్టైలిష్‌గా సమాధానం ఇచ్చినట్లే భావిస్తున్నారు అభిమానులు. ఇక ఈ ఫోటోలు చూస్తే చాలు, ఏం హ్యాండ్సమ్,
ఏం ఛరీష్మా అన్న ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'భోళా శంకర్' సినిమా తర్వాత చిరంజీవి కొంత గ్యాప్ తీసుకున్నారు. కానీ 2025లో ఆయన బిజీ బిజీగా ఉన్నారు. జనవరిలో 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లకు రాబోతుండగా, ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వేసవిలో 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డైరెక్టర్ బాబీ తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ మూవీ కూడా డిసెంబరు లేదా జనవరిలో సెట్స్ పైకి వెళ్లనుంది. అంతేకాదు, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తో ఓ వయలెంట్ డ్రామా చేయనుండగా, ఇందులో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215